# కాలజ్ఞానసుధ


ఆధ్యాత్మిక మాస పత్రిక

నవంబరు - 2015 సంపుటి:19 సంచిక:11




**ఈ నెల సూక్తి**

➢ ఇతరుల కోసం గోతిని త్రవ్వేవాడు తనకు తెలియకుండానే వాడికన్నా ముందు అందులో దిగుతున్నాడని గుర్తించ లేకపోతున్నాడు.



## విషయ సూచిక


| | |
|---|---|
| సంపాదకీయం - అనన్యభక్తి | 4 |
| సనాతన ధర్మము - దాని విశిష్టత | 5 |
| వేదపరిచయము | 7 |
| వీరకాళికాంబా శతకము (తృష్ణాక్షయం) | 9 |
| మానవ సంబంధాల విలువ ( సంభాషణ నైపుణ్యం) | 11 |
| ఆది గురువు ఆచార్య శంకరులు | 15 |
| యోగవాసిష్ట కథాలహరి - ఇద్దరు రాజులు రెండు తపో మార్గాలు | 17 |
| గొప్పలు నావే... తప్పులు ఇతరులవి .. | 19 |
| భగవద్గీతకు భాసురభాష్యం | 20 |
| మహాభారతంలోని నీతి కథలు | 23 |
| రఘువంశం | 24 |
| హయవదనుడు | 29 |
| కర్తవ్యాన్ని మరచిపోరాదు | 31 |
| దర్శనీయ దేవాలయాలు - అరుంధతీ వశిష్ఠ మహర్షుల ఆలయం | 32 |
| శ్రీరామ భక్తి ( ఆరణ్యకముని శ్రీరామభక్తి) | 34 |
| వివిధ వ్యాధులు - ఆయుర్వేద చికిత్సలు | 38 |


ముఖచిత్రం : వామనావతారం

**చందా వివరములు**

జీవిత చందా (20సం॥) : 1116/-
సంవత్సర చందా : 100/-


చందాలు పంపవలసిన చిరునామా:

**కాలజ్ఞాన సుధ**

శ్రీ అచలానందఆశ్రమము, 8-202(1), మంగమూరురోడ్డు,
ఒంగోలు-523002 ప్రకాశంజిల్లా (ఆం.ప్ర)
ఫోన్స్ 08592/235341, 9949132469, 9705555229,
8977799289


సంపాదకులు: శ్రీ పరిపూర్ణ సిద్ధానందస్వాములవారు

సంపాదకీయం

# అనన్యభక్తి

భగవంతుని చేరడానికి అత్యంత దగ్గర మార్గం భక్తిమార్గం. భగవంతునిచేరే మార్గాలు , సాధనలు ఎన్నోవున్నవి. వాటన్నింటిలో భక్తి మార్గం సులభతరమైనది.

భగవంతుడు భక్త సులభుడు. తనను గురించి తపస్సు చేసిన వారికి వరాలిచ్చే దైవం భగవంతుడు. అందుకే ఆయనను భక్తసులభుడుఅంటారు. భక్తాగ్రేశ్వరులలో సిద్ధయ్య, ఆంజనేయుడు, అంబరీషుడు, అక్రూరుడు, ప్రహ్లాదుడు, పోతన, భక్తకన్నప్ప ఇత్యాది ఎందరో మహానుభావులున్నారు. వీరి చరిత్రలను మనం పరికించినట్లైతే వారు ఎంచుకున్న మార్గంలో ఎలాంటి ఒడుదుడుకులు ఎదురైనా భంగపడక నెగ్గినవారె!

సిద్ధయ్యను బనగానపల్లె వెళ్ళి పూలు తీసుకురమ్మన్నాడు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి. అతడు అయ్యా! అంతదూరం వెళ్లి మళ్ళి మీ తపః సమాధి సమయమునకు రాగలనా ? అని ప్రశ్నించలేదు. వెళ్లాడు. మార్గంలో ఎన్నో అవాంతరాలు, జడివాన, పిడుగులు, వరదలు అన్నింటినీ అధిగమించి వెళుతున్నాడు. ఇంతలో పెద్ద ప్రవాహం అడ్డువచ్చినది. ఒక్క క్షణం ఆలోచించాడు. “ఏటికెదురునడువే మనసా! ఏటికెదురు నడువే ! ఏటికెదుబడి సూటి దప్పకను కాటుకొండల కనుమల నడుమను....” అంటూ నదిలో దిగాడు. అతని అనన్యభక్తికి మెచ్చిన గంగాభవాని అతనికి దారిచ్చింది. నది దాటి పయనించాడు. భక్తునికి ప్రకృతి కూడా సహకరిస్తుందనడానికి ఇంత కన్న ఏమి నిదర్శనం కావాలి!

రామరావణ యుద్ధం జరుగుతుంది. ఒకనాటి యుద్ధంలో రామలక్ష్మణులు మూర్ఛపోయారు. రాజవైద్యులు సంజీవినీ మూలికను ముక్కు దగ్గర వాసన చూయిస్తే రామలక్ష్మణులు మూర్ఛ నుండి లేస్తారు” అని చెప్పారు. ఆంజనేయుడు నేను తెస్తాను అని వారి అనుమతితో సంజీవినీ పర్వతం చేరాడు. అక్కడకి వెళ్లిన తరువాత ఆ పర్వతంపైవున్న మూలికలలో ఏది సంజీవినో ఆయనకు అర్థంకాలేదు. ఆంజనేయుడు ఒక్క క్షణం ఆలోచించాడు ఈ పర్వతమే తీసుకు వెళితే పోలా! అనుకొని ఆ పర్వతాన్నే పెకలించి తీసుకొని వచ్చాడు. రాజ వైద్యులు ఆ మూలికను రామలక్ష్మణులకు వాసన చూపించగా వారు లేచి యుద్ధం చేయటం మనకు తెలిసిన విషయమే.

గురుకార్యాన్ని నెరవేర్చటానికి వెనుక ముందు ఆలోచించకుండా వెళ్ళి పర్వతాన్ని పెకలించుకొనివచ్చిన ఆయన అనన్యభక్తిని మనం గుర్తించాలి.

ప్రహ్లాదుడు శ్రీ మహావిష్ణువుని సేవించటం నచ్చని తండ్రి హిరణ్యకశపుడు అతనిని వారిస్తాడు. అతడు వినడు. అతనిని పర్వతాలపై నుండి విసరి వేయించాడు, విషసర్పాలచేత కరిపించాడు. ఎన్నెన్నో చిత్రహింసలు పెట్టాడు. కానీ ప్రహ్లాదుడు ఎక్కడ భయపడటంకాని, తన లక్ష్యాన్ని సడలించటంకాని చేయలేదు. చివరికి అతని ప్రగాఢ భక్తికి మెచ్చిశ్రీ మహావిష్ణు నరసింహ రూపంతో వచ్చి హిరణ్యకశపుని వధించి ప్రహ్లాదుని బ్రోచాడు.

గురువుకి - శిష్యుడుకి లేదా భగవంతునికి - భక్తునికి మధ్య అవ్యాజ్యమైన ప్రేమ, భక్తి వాత్సల్యం వుండాలి. అనన్యభక్తి కలిగిన వారిని ఈ ప్రపంచంలో ఏ శక్తి వారించజాలదు.. మనం మన లక్ష్యంవైపు సాగిపోవాలి. ఎదురయ్యే అవాంతరాలను సమర్థంగా ఎదుర్కొనాలి అనితర కృషితో లక్ష్యాన్ని సాధించాలి అలాంటి ప్రయత్నము పట్టుదలవున్న వారికి ఆ విశ్వ విరాట్ భగవానుని దివ్యాశీస్సులు సర్వదా సర్వత్ర సంప్రాప్తిస్తాయి.

*భగవత్సేవలో.... సంపాదకులు*

# సనాతన ధర్మము - దాని విశిష్టత

...... స్వామి ముకుందానంద సరస్వతి, ఋషికేష్; 09410990829

(గత సంచిక తరువాయి)

**20. ఆశ్రమ ధర్మములు**

మానవుని యొక్క జీవన వ్యవధి నాల్గు భాగములుగా విభజించబడినది. అవి బ్రహ్మచర్యాశ్రమము, గృహస్థాశ్రమము, వానప్రస్థాశ్రమము, సన్న్యాసాశ్రమము. మానవుడు తానున్న ఆశ్రమమును బట్టి, ఆ ఆశ్రమమునకు సంబంధించిన విధ్యుక్త ధర్మములను ఆచరించవలసియుండును. సనాతన ధర్మము ఆశ్రమ ధర్మములను క్రింది విధముగా ప్రబోధించుచున్నది.

**21. బ్రహ్మచర్యం :**

'బ్రహ్మచర్యం' అను పదమునకు రెండు అర్థాలు ఉన్నవి. 1) బ్రహ్మము గురించి మననము చేయుట. 2) మనస్సులో కామభావనగాని, భౌతికంగా కామవ్యవహారంగాని లేకుండా ఉండుట.

మొదటి అర్థములో ఈ పదమును నిర్వచిస్తూ శ్రీ జాబాల దర్మోపనిషత్తు ఇట్లు చెప్పుచున్నది :

"బ్రహ్మభావే మనశ్చారం బ్రహ్మచర్యం పరంతప" (1-14)

అనగా "మనస్సును బ్రహ్మ భావనలో లగ్నము చేయుటయే బ్రహ్మచర్యం"

శ్రీ శంకర భగవత్పాదుల వారు ఇట్లు నిర్వచించినారు :

**"సర్వం బ్రహ్మేతి మోవేద బ్రహ్మచారీ స ఉచ్యతే" !** అనగా సకల చరా చరములలో బ్రహ్మమును తిలకించే వాడే బ్రహ్మచారి".

'బ్రహ్మ' మనగా 'వేద'మని వేరొక అర్థమున్నూ గలదు. కావున, ఎవడైతే వేదాధ్యయన వ్రతము నవలంబించునో, అతడే బ్రహ్మచారి. ఎవడైతే వేదాధ్యయనము ద్వారా అంతఃకరణ శుద్ధిని బొంది, తానే బ్రహ్మమను భావన గలిగియుండునో, వాడే బ్రహ్మచారి. అలాంటి బ్రహ్మచారికి ఈ విశ్వమంతా బ్రహ్మమయంగా గోచరించును.

ఇక రెండవ అర్థములో యాజ్ఞవల్క్యమహర్షి క్రింది విధముగ నిర్వచించినారు.

**శ్లో॥ కర్మణా మనసా వాచా సర్వావస్థాసు సర్వదా।**
**సర్వత్రమైథున త్యాగో బ్రహ్మచర్యం ప్రచక్షతే॥**

'ఎల్లప్పుడు సర్వావస్థలలోను మనసా వాచా కర్మణా స్త్రీ సంగమాన్ని త్యజించినవాడే బ్రహ్మచారి యని చెప్పబడును'.

మన పురాణేతిహాసములలో బ్రహ్మచర్యమును కఠినముగా పాలించి, పరాకాష్టను ప్రపంచానికి చాటిన వ్యక్తులు అనేక మంది ఉన్నారు. అందులో బాలబ్రహ్మచారియైన హనుమంతుడు ప్రథముడు. తరువాత శ్రీరాముడు, లక్ష్మణుడు గూడ జితేంద్రియులై పదునాల్గు సంవత్సరములు బ్రహ్మచర్యమును పాటించి, పరాకాష్టనందుకొన్న మహాపురుషులు.

అందాలరాశియైన సీత ప్రక్కన ఉన్నప్పటికి 'పదునాల్గ సంవత్సరములు కఠినమైన బ్రహ్మచర్యమును పాలించిన ఆదర్శపురషోత్తముడు శ్రీరామచంద్రప్రభువు. శ్రీరాముడు అడవిలో పర్ణశాలయందు పరుండునపడు తనకు సీతాదేవికి మధ్యలో కోదండమును పెట్టి, "హే కోదండమా! నీవే మా బ్రహ్మచర్యమునకు సాక్ష్యము" యని చెప్పి పరుండెడివాడట.

పదునాల్గు సంవత్సరములు పూర్తియయి,

శ్రీరాముడు అయోధ్యకు వచ్చిన శుభసమయమున ఆయన దర్శనార్థమై ప్రజలందరు వీధికి రెండువైపులా బారులు తీరి ఉన్నారట. శ్రీరాముడు వారినందరిని తిలకిస్తూ రాజభవనము చేరిన పిదప, వశిష్ఠులవారి వద్దకు వెళ్ళి, "హే గురుదేవా! ఈ రోజు ప్రజలందరిని తిలకించినాను, వారిలో పదునాల్గు సంవత్సరముల లోపు వయస్సు గలిగిన బాలుడు ఒక్కడును కనిపించలేదు, కారణమేమి ?" యని ప్రశ్నించినాడు. అపుడు గురుదేవులు ఆశ్చర్యచకితులై, దివ్యదృష్టితో వాస్తవమును దర్శించి, ఇట్లు చెప్పినారు. "రామచంద్రా! అయోధ్యలోని దంపతులు నీ యొక్క వియోగములో చింతాక్రాంతులై కామవాంఛనే పూర్తిగా త్యజించినవారై, ఈ పదునాల్గు సంవత్సరములలో సంతతినే బడయరైరి. ఇదియే కారణము". చూచితిరా! శ్రీరామచంద్రుని గొప్పతనము!! పదునాల్గు సంవత్సరములు అయోధ్యావాసుల చేత గూడ బ్రహ్మచర్యమును పాలింపచేసిన ఆదర్శ పురుషోత్తముడు శ్రీరాముడు.

ఇక, లక్ష్మణుడు బ్రహ్మచర్యంలోగాని, సచ్ఛీలములోగాని శ్రీరామునికి ఏ మాత్రమూ తీసిపోడు. లక్ష్మణుడు పదునాల్గు సంవత్సరములు కఠిన బ్రహ్మచర్యమును పాలించుటయే గాక, పరస్త్రీలను కన్నెత్తియైనను చూడని సత్పురుషుడు, సచ్ఛీల సంపన్నుడు.

సీతారాముల వివాహమయిన తరువాత పండ్రెండు సంవత్సరములు అయోధ్యలోను, పదమూడు సంవత్సరములు వనములోను వారి ననుసరించుచు, వారి సేవచేయుచు గూడ తన స్వంత వదిన అయిన సీతాదేవి యొక్క మోమును చూచి యెఱుగని సద్బ్రహ్మచారి లక్ష్మణుడు, సీతాదేవి ఋష్యమూక పర్వతముపై వదిలిన నగల మూటను శ్రీరాముడు లక్ష్మణుడికిచ్చి "ఇవి మీ వదినవేమో పరిశీలింపుము" యని ఆదేశించినపుడు, లక్ష్మణుడిచ్చిన సమాధానమే దీనికి నిదర్శనము. లక్ష్మణుడిట్లు చెప్పెను.

శ్లో॥ నాఽహం జానామి కేయూరే నాఽహం జానామి కుండలే।
నూపురే త్వభి జానామి నిత్యం పాదాభివందనాత్॥
(వా. రామాయణం)

"నేను సీతాదేవి యొక్క బాహువులకు ధరించు దండకడియములను ఎఱుగను. ఆమె చెవులకు ధరించు కుండలములను ఎఱుగను . నేను ప్రతి నిత్యము పాదాభివందనము చేయునపుడు చూచుచుందును గాన ఆమె పాదములపై ధరించుచుండు నూపురము (అందె)లను మాత్రము ఎఱుగుదును".

ఈ సమాధానమును వినినపుడు మన హృదయము కలిచివేయును. ఇంతటి సౌశీల్యసంపన్నులు, బ్రహ్మచర్యవ్రతులు ఏ దేశచరిత్రలోనైన కనిపిస్తారాయని ఆశ్చర్యచకితులమగుదుము. కాని, ఇది యథార్థము గదా! ఇదియే భారతీయ సంస్కృతి యొక్క గొప్పదనము మరియు ప్రత్యేకత. ఈ భారతీయ సంస్కృతికి మూలాధారమైన సనాతన ధర్మము యొక్క గొప్పదనమున్ను ఇదియే.

ఇక, హనుమంతుడు వీరిద్దరిని మించిన వాడు బ్రహ్మచర్యవ్రత పాలనలో, అతడు ఆ జన్మము బ్రహ్మచారిగా ఉండి, రాముని సేవకే తన పూర్తి జీవితమును అంకితము చేసిన పుణ్యపురుషుడు.

హనుమంతుడు సముద్రలంఘనము చేసి, లంకిణిని జయించి, లంకలో ప్రవేశంచినాడు. ఇపుడు సీతాదేవిని వెదకాలి. ఎలా వెదకాలి ? ఎక్కడ వెదకాలి ? అనే ప్రశ్నలు తలెత్తాయి. స్త్రీ స్త్రీలలోనే ఉంటుంది, కాబట్టి అంతఃపురములో వెదకాలి అని నిర్ణయించుకొన్నాడు. కాని, అంతఃపురములో ప్రవేశించుటెట్లు? ఇచట పరిస్థితి చూస్తే- ఎవరకీ తెలియకుండా గాలి కూడ నంచరించడం కష్టమనిపిస్తోంది అనుకొన్నాడు. అపుడొక ఆలోచనవచ్చి, అదే క్రియారూపం దాల్చింది. (సశేషం

# వేద పరిచయము

అథర్వవేద పరిచయము

.......... ఆచార్య డా॥ మట్టి కృష్ణారెడ్డి ............

(గత సంచిక తరువాయి)

జగత్ప్రసిద్ధములగు చతర్వేదములలో అథర్వవేదము నాల్గవది. అనేక మంది విద్వాంసులు ఈ అథర్వవేదమును వేదములలో లెక్కించుటకు సందేహించిరి. ఋగ్, యజుస్, సామ వేదముల తరువాతనే ఇది యేర్పడినదని వారి తలంపు. ప్రాచీన గ్రంథములలో వేదత్రయమును గురించిన వర్ణనలను వీరు హేతువులుగా జూపుదురు. ఐతరేయ బ్రాహ్మణము, "త్రయో వేదా అజాయన్త" అని కలదు. తైత్తిరీయ బ్రాహ్మణములో "వేదై రశూన్య స్త్రిభిరేతి సూర్యః", "యం ఋషయ స్త్రయా విదో విదుః ఋచః సామాని యజూంషి" అనియును కలదు. వీనిని యీ విద్వాంసులు హేతువులుగా చూపెట్టుట అనంగతముగ నున్నది. ఏలయన! ఈ గ్రంథములలోనే చతుర్వేదములను గురించియును తెలుపబడినది. ముండకోపనిషత్తులో "తత్రాపరా ఋగ్వేదో యజుర్వేదః సామవేదోఽ థర్వవేదః శిక్షాకల్పః ," శతపథ బ్రాహ్మణములోని బృహదారణ్యములో "అస్య మహతో భూతస్య నిఃశ్వసితమేతద్ యద్ ఋగ్వేదో యజుర్వేదః సామవేదోఽ థర్వాంగిరసః" అనియు నాలుగు వేదములను గురించిన వర్ణణలున్నవి.

వేదములు మూడా? లేక నాలుగా ? యను ప్రశ్నకు సమాధాన మీ క్రింద వ్రాయబడుచున్నది "వేదత్రయీ" అను పదమును చూచి వేదములు మూడే యని తలంచుచున్నారు. కాని "వేదత్రయీ" శబ్దము ద్వివిధాభిప్రాయములతో ప్రయోగింపబడుచున్నది యాజ్ఞిక కర్మకాండలో ఋగ్, యజు స్సామముల ప్రయోగమే అధికముగా నుండును. అథర్వవేదజ్ఞుడగు బ్రహ్మ యజ్ఞములో సాక్షిమాత్రుడుగా నుండును. అందుచే యజ్ఞకర్మలందు "వేదత్రయీ" యనుటలో రెండవ యభిప్రాయము జైమినీయ మీమాంస ద్వారా గ్రహింపవచ్చును. చతుర్వేదములలోని మంత్రరచన ముప్విధములుగ నున్నది. అవి ఋక్కులు, సామములు, యజున్సులని చెప్పబడును. ఛందోబద్ధమైన మంత్రములను ఋక్కులనియు, గీతాత్మకమైన మంత్రములు సామములనియు, గద్యాత్మకములగు మంత్రములు యజుస్సులనియు తెలుపబడినది. అందుచే వేదములను "వేదత్రయీ" అని ప్రయోగించినారు.

యజ్ఞకాండలో నలువురు ఋత్విక్కు లుందరు. ఋగ్వేద మంత్రపాఠకుని "హోతా" అనియు, యజుర్వేదజ్ఞుని "అధ్వర్యు" డనియు, సామగాయకుని "ఉద్గాత" యనియు, అథర్వవేదజ్ఞుని "బ్రహ్మ" యనియు పిలుతురు. అందుచే బ్రహ్మవేద మనబడు అథర్వవేదము చతుర్వేదములలోనిది కాదని భావించరాదు. ప్రాచీన గ్రంథములలో కూడ ఈ నాలుగు వేదములను గూర్చిన వర్ణనలు సర్వత్ర గోచరించును. యాజుష శాఖలగు తైత్తిరీయాది గ్రంథములలో కూడ "వేదత్రయీ"ని గురించి చెప్పినను "అథర్వాఙ్గిరోవిద్" అని అథర్వవేదజ్ఞుడగు బ్రహ్మను గురించియును చెప్పబడినది. ఐతరేయ

బ్రాహ్మణమున యజ్ఞము వాణి ద్వారా, మరియు మనస్సు ద్వారా రెండు విధములుగా జరుగునని కలదు. వాణి ద్వారా వేదత్రయ మంత్రోచ్చారణచే సగభాగ యజ్ఞము నిర్వహిపబడుననియు, మిగతా సగభాగ యజ్ఞము బ్రహ్మ ద్వారా మనస్సులో మౌనముగా నిర్వహింపబడుననియు యుల్లేఖింపబడినది.

అథర్వవేద మంత్రములలో కూడా జైమినీయ మీమాంసలో తెలిపిన విధముగా ఋక్కులు, సామములు, యజున్సులు కలవు. ఋక్ యజుస్సామము లనెడు మంత్ర రచనా విభాగమును గాంచి యనేకమంది విద్వాంసులు మూడే వేదములని భ్రమ చెందిరి. అథర్వవేదములోని మంత్రములు కూడా యీ మువ్విధ రచనా విభాగమును కలిగియుండుట వలన అథర్వవేదము కాదని చెప్పుట సరికాదు. వేదములలోని అంతస్సాక్ష్యమును పరికించినదో యజ్ఞస్వరూపుడగు ప్రజాపతి అనగా పరమాత్మ నుండియే చతుర్వేదము లావిర్భవించినవని తెలియుచున్నది.

**తస్మాద్ యజ్ఞాత్ సర్వహుత ఋచః సామాని జజ్ఞిరే ఛన్దాంసి జజ్ఞిరే తస్మాత్ యజుస్తస్మాద్ అజాయత**

ఈ మంత్రము ఋగ్వేదమున 10వ మండలము, 7వ సూక్తములోని 8వ మంత్రముగాను, యజుర్వేదమునందు 31వ అధ్యాయములోని 7వ మంత్రముగాను, అథర్వవేదములోని 19వ కాండమందలి, ఆరవ సూక్తమున 13వ మంత్రముగాను కలదు. ఈ మంత్రములో గల ''ఛన్దాంసి'' యను శబ్దము అథర్వవేదమునకు పర్యాయపదమై యున్నది. ఈ మంత్రమున నాలుగు వేదములు యజ్ఞస్వరూపుడగు పరమేశ్వరుని నుండి ఆవిర్భవించినట్లుగా చెప్పబడినది.

**యస్మాదృచో అపాతక్ష పాక్షన్ యజుర్యస్మాదపకాష సామాని యస్య లోమాన్యథర్వాఙ్గిరసో ముఖమ్ స్కమ్భంతం బ్రూహి కతమః స్విదేవ సః॥ అథర్వ (10-7-20)**

ఈ మంత్రములో ఋగ్యజుస్సామాథర్వణ వేదములు ఈశ్వరకృతములని తెలుపబడినది. మరియు నీ వేదములలోనే చతుర్వేద యుత్పత్తిని గురించి చెప్పబడగా వ్యాఖ్యాన రూపములగు అత్యర్వాచీన గ్రంథములగు బ్రాహ్మణములలో వ్రాయబడిన 'త్రయీ' శబ్దమును గాంచి వేదములు మూడేయని భ్రమను జెందుట ఎంత మాత్రము సమంజసముగాదు. చతుర్వేదములలో అథర్వవేదము 'ఛన్దస్సు, అథర్వాఙ్గిరసమ'ను రెండు నామములతో పేర్కొనబడినది.

'త్రయీ' యనగా మువ్విధ రచన యను విషయమును మరువవలదు. పాణిని 'అథర్వ' మను పేరును దీసికొనలేదు. కావున నది ''అర్వాచీన'' మని కొందరనెదరు. ఇదియును వారి భ్రమయే. నిరుక్తకారుడగు యాస్కమునియును అథర్వవేదము నందలి అనేక మంత్రములను తన నిరుక్తము నందుహరించినాడు. ఇదే విధముగ అథర్వవేద మందలి అనేక మంత్రములు నాలుగు వేదములందనేక స్థలములందును వచ్చియున్నవి.

ఐతరేయ బ్రాహ్మణమునందు 'హోత' కార్యములు ఋగ్వేదముతో, 'అధ్వర్య' కార్యములు యజుర్వేదములో, 'ఉద్గాత' కార్యములు సామవేదముతో, 'బ్రహ్మ' కార్యములు అథర్వవేదముతో జరుగునని నాలుగు వేదములకు గల పరస్పర సంబంధమును దెలుపబడినది. వేదములు అపౌరుషేయములు. పరమేశ్వరుడు స్వయం ప్రకాశస్వరూపుడగుటచే ఆతని గుఱించి

➢ తరువాయి 18 వ పేజిలో.......

శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారి రచనల్లో విశిష్ట రచన

# వీరకాళికాంబా శతకము

భావచ్ఛందోஉనుసరణ: కీ.శే. డా॥ వి.వి.యల్.నరసింహారావు (కందిమల్లయ్యపల్లె) బ్రహ్మంగారి మఠం ఆస్థాన కవి

## 26. తృష్ణాక్షయం

(గత సంచిక తరువాయి)

**పారజూడవలయు బయలు బ్రహ్మాండమ్ము**
**మొయిలు విడిచెనేని బయలు తోచు**
**హయము చిత్త; మచట లయము గావలె నది**
**కాళికాంబ! వీర కాళికాంబ! 443**

బ్రహ్మాండం నిండి ఉన్న బ్రహ్మము అచలుడై ఉత్తబయలుగా వున్న ఆకాశం నిండి ఉంటాడని అచల పరిపూర్ణవాదం. 'ఆకాశో బ్రహ్మ' అనే ఈవాదాన్ని వీరబ్రహ్మేంద్రస్వామివారు కూడా ప్రబోధించారు. మబ్బు తొలగితే ఆకాశం స్వచ్ఛమైన బయలుగా ప్రకాశిస్తుంది. మబ్బంటే 'మాయ' అన్నమాట. మనసు పరుగెత్తే గుఱ్ఱం. ఈ గుఱ్ఱం బ్రహ్మము దగ్గరకు జీవుణ్ణి చేర్చాలి. బ్రహ్మములో లయించడానికి జీవుని మనస్సే ప్రబల సాధనమని భావం.

**చిత్తశుద్ధి లేక శివపూజ యెట్లగు?**
**భక్తిలేని పూజ పత్రి చేటు**
**ముక్తి పద మిది యటె? భక్తి సోஉహము కదా?**
**కాళికాంబ! వీర కాళికాంబ! 444**

ఈ పద్యం వీరబ్రహ్మముగారికి సమకాలికుడైన వేమన పద్యం వలె వినిపిస్తున్నది. వయస్సు చేత, రచన చేత వేమన కంటె వీరబ్రహ్మేంద్రస్వామివారు నలభైయేళ్లు ముందరివారు. ఇద్దరి అభిప్రాయాలూ ఒకే విధమైనవి కనుక 17వ శతాబ్దాన్ని ఇద్దరూ ప్రభావితం చేశారు. కనుక ఒకరి రచనపై ఇంకొకరి రచనాప్రభావం కొంతవరకు ప్రసరించే వీలుంది. ఇద్దరి రచనలూఅనురూపంగా ఉండటంలో ఆశ్చర్యం లేదు.

శివుడికి చేసే బాహ్యపూజ చిత్తశుద్ధితో చేస్తేనే సఫలమౌతుంది. భక్తితో మారేడుపత్రి శివుడికి వినియోగించకపోతే ఆ పత్రి వ్యర్థమే. మోక్షపదం పొందాలంటే పరిశుద్ధమైన మనస్సుతో 'సః+అహమ్=సోஉహమ్; అతడే నేను, ఆ శివుడే నేను' అని అద్వైతభావన చెయ్యగలగాలి.

**పథము కానరాని పదవు లవేలకో!**
**నిజము కాని మనసు నీ కదేల?**
**ముదిమి గడచినంత మురహరి దొరకునా?**
**కాళికాంబ! వీర కాళికాంబ! 445**

మనస్సుతో వివేచించి దారి తెలుసుకోవాలి. అప్పుడే పథము (దారి) కనిపిస్తుంది. గమ్యం చేర్చే ఈదారి తెలుసుకోకుండా ఎంత ఉన్నత పదవు లధిష్ఠించినా ప్రయోజనం ఉండదు. నిజమైన భక్తి మనస్సు నుండే పుడుతుంది. అట్లా నిజమైన భక్తి కలిగించే మనస్సే కావాలి. వయసు వచ్చినంత మాత్రాన లాభం లేదు. "నేను ముసలివాణ్ణయ్యాను గదా! ఆ విష్ణువు(మురహరి) నాకు దర్శనమివ్వడా?" అనుకుంటే అదే వెఱ్ఱి.

**హరి హరాదుల మరియాద తెలియవలె**
**వేరు సేయరాదు వారి నెవరి;**
**నీకు బంధ మేల? నీలాపనిందలౌ**
**కాళికాంబ! వీర కాళికాంబ! 446**

విష్ణువు, శివుడు మొదలైన సర్వవ్యాపకత్వం కలిగిన విశ్వాత్ములు. వారి హద్దులు, మరియాదలు సంకుచితాలు కావు. అది తెలుసుకొని వారిని మనకు దూరం చేసుకోకుండా ఉండాలి. లోకులమైన మనం సంసారబంధాల్లో చిక్కుకొని ఉంటాము. అవతార మెత్తినపుడు హరిహరాదులు కూడా సంసారబంధంలో చిక్కుకొని ఉన్నట్లు కనిపిస్తారు. వారిని చూచి

మనమూ అట్లా ఉంటున్నా మనుకోవచ్చు. విశ్వాత్ములైన వారు బంధాల్లో చిక్కుకోరు. లౌకిక జీవులమైన మనం బంధాలలో విధిగా చిక్కుకుంటాము. అందుకే అంటున్నాడు గురుదేవుడు - "నీకు బంధ మెందుకు?" అని వదిలించుకోలేని బంధమైతే దాని వల్ల జీవులకు అపనిందలు వస్తాయి. రాకూడని నిందలు విపరీతంగా వస్తే వాటిని నీలాపనిందలు అంటాము. అటువంటి నిందలు రాకుండా చూచుకోవాలి.

**మూడు నొక్కటైన వాడెపో బ్రహ్మంబు**
**చేను దున్నిన కృషి చెడునే యెపుడు?**
**బలము పెట్టువాడు పరిగెన పోవునా?**
**కాళికాంబ! వీర కాళికాంబ! 444**

తత్వదృష్టితో చూచినప్పుడు త్రిసంఖ్యకు ప్రాధాన్య మెక్కువగా కనిపిస్తుంది. త్రిగుణాలు - సత్వరజస్తమో గుణాలు, సృష్టి స్థితి లయములు ఉన్నాయి. ఇవి త్రిమూర్తుల గుణాలు బ్రహ్మ విష్ణు మహేశ్వరుల లక్షణాలు. ఈ మూడు ఒక్కటై పరబ్రహ్మము నందుంటాయి - సృష్టిస్థితులు, సత్వ రజస్సులు ప్రకృతి లో ప్రత్యక్షంగా చూడగలుగుతుంటాము. కర్షకుడు చేను దున్ని విత్తు వేయటమే సృష్టి - విత్తు మొక్కై ఫల మందించటమే కృషిఫలం. ఇదెప్పుడూ చెడేది కాదు. చేనుకు బాగా బలం పెట్టిన రైతు అల్పమైన పెరిగె పంటతో తృప్తిపడతాడా? రాసుల కొద్దీ ధాన్యం బస్తాలకు నింపుకో గలుగుతాడు. భక్తితో చేసే సాధకుని కృషి కూడా అటువంటిదే. అటువంటి సాధకుడే పరబ్రహ్మమును దర్శించగలుగుతాడు. అతని కృషి వృథా కాదు.

**శ్రామికులను పెద్ద లే మందు రెవరైన?**
**మారిపోవు వారి మాట పోవు**
**సులభునెంతురె భువి శూరు మెత్తురుగాని**
**కాళికాంబ! వీర కాళికాంబ! 448**

శ్రమచేసే కార్మిక కర్షకులున్నారు. శ్రామికులైన అటువంటి వార్ని చూస్తే పెద్దలకు కూడా ఎంతో ఆదరం. శ్రమ చెయ్యకుండా సోమరుల్లాగా ఉండేవారి మాట మీద ఎవరికీ లక్ష్యముండదు. వాళ్లమాటలే వృథా అవుతాయి. అందరికీ సులభంగా కనిపించే వారిని నిర్లక్ష్యంగా చూస్తాం. శౌర్యంతో మంచిపనులు చేసే వారుంటారు. అటువంటి వారిని అందరూ ప్రశంసిస్తారు. కనుక కృషి శౌర్యం రెండూ అవసరమే.

**తనువులోని మదను తా పట్టి విడువక**
**కర్మవాసన లుడుగంగబోవు**
**కడచి పోవువారి క్రమము లా తీరులౌ**
**కాళికాంబ! వీర కాళికాంబ! 449**

మదను డంటే మన్మథుడు. జీవుల శారీరాన్ని చిత్తాన్నీ ఆశ్రయించి కామభావాన్ని ప్రకోపింప చేస్తాడు. చిత్తజు డైన కాముడు తృష్ణను పెంచుతుంటాడు. చేసే కర్మ లన్ని కామదృష్టితో చేసే జీవుడు తృష్ణకు వశుడైయున్నా డన్నమాట. తృష్ణ కర్మవాసనా ఫలమే. దాన్ని కడచి ముందుకు పోగలవారు సంయములైన యోగులు మాత్రమే. వారి నడవడి సక్రమంగా ఉంటుంది. వారు తృష్ణను జయించినవారు.

తృష్ణాక్షయం వల్ల ఒక విలక్షణమైన సుఖం కలుగుతుంది. ఇటువంటి సుఖాన్ని పోషించేది శాంతం. ఇది మోక్షంతో ముడిపడి ఉంటుంది. ధర్మార్థ కామమోక్షములలో మోక్షమునకు శాంతము శరణ్యం. మహాభారత కావ్యంలో అంగిరసము శాంత మనియే ధ్వనికారుడైన ఆనందవర్ధనుడు స్పష్టం చేశాడు.

**"మోక్ష లక్షణ ఏవెకః పరః పురుషార్థః**
**శాస్త్రనయే కావ్యనయే చ తృష్ణాక్షయ సుఖపరిపోషక లక్షణః**
**శాంతే రసో మహాభారత స్యాంగిత్వేన ఇతి సుప్రతిపాదితమ్**
**ధ్వన్యాలోకము"**

శాస్త్రలక్షణం కావ్య లక్షణం - రెండూ కలిగిన భారత మహాకావ్యంలో పరమపురుషార్థమైన శాంత రసం తృష్ణాక్షయ సుఖపరిపోషక లక్షణం ఉంది. ఇది మోక్షలక్షణం కల ప్రధాన రసం - భారత కావ్యంలో. భారతకావ్యంలోనే కాదు, ప్రకృతిలోని సర్వజీవుల్లోను ఈ లక్షణం ఉండాలి. అందుకు సంసారం కొంత ప్రతి బంధకమే. అందుకే గురుదేవుడు సంసారం గూర్చి మోక్షయోగం గూర్చి రానున్న 24 పద్యాలలో వివరించ బోతున్నాడు.

## మానవ సంబంధాల విలువ

# సంభాషణ నైపుణ్యం

జి.వి. శేషారెడ్డి

జీవితాన్ని స్వర్గము చేసుకోమని దేవుడు మానవజన్మను ప్రసాదించాడు. తెలిసికూడ మానవుడు తన జన్మను సార్థకత చేసుకోకుండ నరక కూపంలో గడుపుతున్నాడు. భోగి తర్వాతే యోగి అన్న కర్మ సిద్ధాంతము ప్రాపంచికము నుంచి ఆధ్యాత్మికతకు ప్రాముఖ్యతనిస్తుంది. భౌతిక సుఖాలను సులభంగా మానవుడు త్యజించలేడు. సముద్రంలోకి వెళ్లే జాలరి తప్పక సముద్ర వేటకు వెళ్ళి ఆటు, పోట్లకు అలవాటుపడి జీవన స్రవంతిని కొనసాగిస్తాడు. అపుడు జాలరి జీవితం సంతోషదాయకం. బాధ్యతను మరువడు. సముద్రపు వేటకు వెళ్ళకుండా ఉండడు

ప్రతి మనిషి తన్నుతాను తెలుసుకోవడమే కాకుండ ఇతరుల మనస్సునెరిగి ప్రవర్తించిన వారు ఉత్తములు. స్వర్గం మనమే, నరకం మనమే. ఇంటగెలిచి రచ్చ గెలవమన్నారు. ఇంటిలోని వాతావరణము ప్రశాంతంగా ఉంటే, ఇంటి యజమానిగాని యజమానురాలుగాని నిర్వర్తించవలసిన కార్యక్రమాలు సజావుగా సాగిపోతాయి. భార్యభర్తలను బంధము పాలు నీళ్ళలాగ ఉంటె తప్ప లేకపోతే కుటుంబ పరిస్థితి చుక్కాని లేని నావలాగ తయారవుతుంది. భార్యభర్తకు తగ్గట్లు, భర్త భార్యకు అణుగుణంగా ప్రవర్తిస్తేనే సంసారమనే నావ క్షేమంగా తీరము చేరుతుంది. స్త్రీ సహనానికి మారుపేరు. స్త్రీని భూదేవితో పోల్చడం అదే అర్థం కదా! సహనం, సౌశీల్యం, సభ్యత, వినమ్రత, స్త్రీకి భూషణాలు. ప్రతి పురుషుని విజయానికి కారణం స్త్రీ అన్నది సత్యమే కదా! అంటే స్త్రీ పురుషుని ఎలా మలచుకోవాలో అలా మలచుకోగల శక్తి సామర్థ్యాలు ఉంటాయి. స్త్రీమాట పురుషునికి వేదంగా మారాలంటే, స్త్రీ పురుషుని మనోభావాలు దెబ్బతినకుండ తాను మాట్లాడే ప్రతిమాట పురుషుడు దేన్నైన సాధించగలడు. రామకృష్ణుని ఆధ్యాత్మిక జీవితం నిరాటంకముగా సాగడానికి ఆయన సహదర్మచారిణి సహకారము. భక్తతుకారాం ఆధ్యాత్మిక జీవితం అరమరకలు లేకుండ సాగిపోయి కైవల్యం పొందడానికి తుకారాం సహధర్మచారిణి సమన్వయ సహకారమే కదా!

మానసిక ప్రశాంతతతో ఆనందపుటంచులలో దైవనామ స్మరణ చేసుకోవడాన్ని స్వర్గమంటే సబబేమో! ఆధ్యాత్మికుని స్వర్గము శాశ్వితానందాన్ని ఎల్లప్పుడు ప్రసాదిస్తు తన ఆధ్యాత్మిక జీవితము ఎంతో మందికి ఉదహరించుకొనే విధంగా తీర్చిదిద్దుకోవడానికి తోడుగా సహకరించేది తన శరీరంలో సగభాగమైన భార్యయే కదా! నరుడు నరకాన్ని కూడ ఈ భూలోకంలోనే అనుభవిస్తున్నాడు. ప్రాపంచికము నుంచి ఆధాత్మిక వైపు జీవితము సాగించాలంటే తనను అర్థము చేసుకొని తన ఆధ్యాత్మిక ప్రయాణానికి జీవిత భాగస్వామి తోడుగాను అండగాను నిలిస్తే తప్పక ఆధ్యాత్మిక ఫలాలను ఆస్వాదిస్తు ఆ ఫలాలను అందరికి పంచి పెట్టడం సుసాధ్యం.

సంసార సాగరాన్ని విజయవంతంగా దాటగలిగినవాడే కర్మ సిద్ధాంతానికి కట్టుబడి బాధ్యతలను పూర్తిచేసి సంపూర్ణ మానవుడుగా ఆధ్యాత్మిక ఒడిలో పయనించి స్వర్గమనే తీరాన్ని చేరగలడు. సంసారమంటేనే కుటుంబము, భార్య, పిల్లలు, తల్లిదండ్రులు ఇతర సంబంధీకులు. సంపూర్ణమానవుడు కర్మసిద్ధాంతం ప్రకారము

భాధ్యతలన్నింటిని పూర్తి చేసుకొని ఒక మంచి భర్తగాను, ఒక మంచి తండ్రిగాను, ఒక మంచి కుటుంబీకుడుగాను జీవించాలంటే భార్య విశాల హృదయము, ఉదారత్వము, సంపూర్ణ సమన్వయ సహకారము అవసరం. భార్యనేర్పరి అయితే భర్తను ఎటువంటి పరిస్థితుల్లోను బాదించదు. భర్తకూడ అంతే. జీవం కలిగిన ప్రతి ప్రాణి దైవమే. ఈ జీవితం క్షణికం, ఈ ప్రాపంచికమంతా అశాశ్వితం అని తెలుసుకోవడానికి మంచి గురువు మన అనుభవమే! ఎన్నిపుస్తకాలు చదివినా, సత్‌సంగాలు ఎన్నివిన్నా, తన్ను తాను తెలుసుకోలేని స్థితికి కారణం అన్ని తెలుసునన్న అహం, మొండితనం, ఈర్ష, ద్వేషం, విపరీతమైన కోపం.

సకారాత్మకత లేనపుడు జీవితమంతా నరకమే. బాహ్యసుఖాలైన ఆస్తులు ఎపుడు కూడ శాశ్విత ఆనందాన్నిఇవ్వలేవు. నకారాత్మకంగా ఆలోచించినపుడు ఏ మనిషి జీవితమైన ప్రతి నిముషము ఆందోళన, అలజడి, ఒత్తిడి, కోపం ఈర్ష ద్వేషాలతో నిండివుంటుది. నకారాత్మకంగా ఆలోచనలు లేనపుడు, కుటుంబంలో భార్యగాని, భర్తగాని కుటుంబ వాతావరణాన్ని కలుషితము చేసి నరకాన్ని అనుభవిస్తారు. ఆలోచనలో సకారాత్మకం లేనపుడు పరిస్థితులను సరిగా అవగాహన చేసుకోలేక సమస్య చిన్నదైన పరిష్కరించుకోలేరు.

సిద్ధార్థుడు, బుద్ధుడు కావడానికి సహధర్మచారిణి సహకారం ఎంతో ఉంది. త్యజించడం అనుకున్నంత సులువుకాదు. ప్రాపంచిక విషయాలను త్యజించడానికి ఆత్మస్థైర్యముతోపాటు భార్యగాని, భర్తగాని ఒకరికొకరు సమన్వయంతో మెలగాలి. సూక్ష్మవిషయాన్ని స్థూలంగా పెంచి కుటుంబ వాతావరణాన్ని నరకప్రాయం చేసుకోవడం విజ్ఞులు ఎవ్వరు చేయ్యరు.

ఎవరి తప్పులు వారికి తెలియవు తెలుసుకున్న తమ తప్పులను ఒప్పుకొనేవారు చాలా గొప్పవారు. మనము మాట్లాడే విధానము మనకు బాగా నచ్చుతుంది నేను బాగానే మాట్లాడాను అని అనుకోవడం సహజం. మన మాటలు ఇతరులను ఎంత బాధిస్తున్నాయో తెలుసుకోవడం ఉత్తముల లక్షణం. ఎదుటివారి తప్పులను ఒక వేలితో చూపిస్తే నాలుగు వేళ్ళు మనవైపు చూపిస్తుంటాయి. సమయస్ఫూర్తి లోపించి కోపము ఎక్కువైనపుడు ఇతరుల మనస్థత్వాన్ని ఎరుగకనే మాట్లాడతాం. ఇది చాలా తప్పు.

ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సరియైన అవగాహన లేక వంచర్దాను సారంగ సమయస్ఫూర్తిలేకుండ మాట్లాడితే మిగిలేది శోకతప్త హృదయం. అందుకే కుటుంబములో భార్యభర్తను అర్థం చేసుకొని భర్త అలసట, ఆవేదన, ఒత్తిడి, అస్థిరతను గమనించి తగినట్లుగా ప్రవర్థిస్తే కుటుంబము స్వర్గసీమగా దూరుతుంది భర్తకాని, భార్యగాని ఇంకొకరితో పోల్చుకొంటే లోపాలున్నట్లు తప్పక కనిపిస్తుంది. ఈ విధంగా తమను ఇంకొకరితో పోల్చుకొని తమను తక్కువ చేసుకోవడం వ్యక్తిత్వంకాదు. ఎవరి మార్గంలో వారు ఆధ్యాత్మిక గమ్యాన్ని సులువుగా చేరుకోవచ్చు. పరిస్థితులను బట్టి ఆలోచన పరంపర మొదలవుతుంది. అలాంటపుడు పరిస్థితులకు అణుగుణంగా తమ గమ్యాన్ని చేరుకోవడానికి ఏ వ్యక్తి అయిన ప్రయత్నం చేస్తాడు. మహాపురుషులు, వేదాంత వేత్తలు, ప్రవక్తలు, శాస్త్రజ్ఞులు, సాహిత్యవేత్తలు, దేశభక్తులు, ఉత్తమ క్రీడాకారులు ఆయా రంగాలలో విశిష్టమైన కృషిచేసి ఆయారంగాలలో నిష్ణాతులు కావడానికి పరిస్థితులు అనుకూలించడమే కదా! వీరి జీవిత ప్రయాణాన్ని గమనిస్తే స్వర్గతుల్యమే! ఎందుకు కుటుంబమును కావలసిన సహకార్య సమన్వయాలు పొందగలిగారు.

ప్రపంచ ఏడు అద్భుతాలలో తాజ్‌మహల్ ఒకటి. ఈ తాజ్‌మహల్‌ను కట్టించిన షాజహాన్ చక్రవర్తి భార్యను ఎంతగా ప్రేమించి ఉంటే ఇటువంటి అద్భుతమైన పాలరాతి కట్టడానికి ముంతాజ్ ప్రేమ, మాటతీరు, ఔన్నత్వం, ఔదార్యం, ఉట్టిపడే మానవత్వం, అనిర్వచనమైన అందం అంటే సబబేకదా!

ఈ శరీరాన్ని చాలించే వరకు ఈ భౌతిక ప్రపంచంలో జీవన ప్రయాణం సుఖంగా సాగిపోవాలంటే కుటుంబంలో ముఖ్యంగా భార్యభర్తల అనుభంధం వారి సంభాషణ నైపుణ్యంలో ఉంటుంది. భార్య మాట్లాడే తీరు భర్తను బాధిస్తుందని భావిస్తాడు. భార్య, భర్త మాట్లాడే విధానం బాధిస్తుందని అంటుంది. కారణము ఒకరి తప్పులు ఒకరు చూడడం. తమ తప్పు ఏమిటో తెలుసుకోలేక పోవడం, దీనిలో కుటుంబ వాతావరణం నరకతుల్యం. భర్తకాని, భార్యకాని ఈ విధంగా సరైన అవగాహన లేక ఒకరినొకరు తప్పులెంచుకొంటు ఆలోచన విధానం అదమంగా ఉంటే ఆధ్యాత్మికం గురించి ఆలోచించేదెపుడు. అందుకే కుటుంబ వాతావరణము ప్రశాంతము ఉంది. భార్యభర్తలిరువురు సమన్వయములో జీవన పోరాటాన్ని సాగిస్తే తమ జన్మలకు సార్థకతను ప్రసాదిస్తారు. రైతు ఆచి తూచి పైరు పెడతాడు. రైతు పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు మాత్రమే విత్తుతాడు. అపుడు మాత్రమే ఫలితాన్ని పొందుతాడు. అదే విధంగా కుటుంబములో వాతావరణం ప్రశాంతంగా, ప్రేమతత్వంతో నిండి ఉండే కుటుంబములోని వ్యక్తులు ఆధ్యాత్మికత గురించి ఆలోచిస్తారు.

సునిశ్చితంగా, సువిశాలంగా ఆలోచిస్తే నరకం, స్వర్గం మన ప్రవర్తన మన ఆలోచన ముఖ్యంగా మన మాటల తీరువల్లె మనం గమనిస్తాము. మాటల వరవడి తుఫాను బీభత్సము సృష్టించునట్లు, కుటుంబవాతావారణాన్ని కలుషితం చేస్తుందనడం సరి అయినదే కదా !ప్రతి విషయాన్ని జాగ్రత్తగా ఆచితూచి ఆలోచించి మాట్లాడ్డమే తెలివైనవానిపని.

సకారాత్మకత సంభాషణలో చాలా అవసరము. మాట్లాడే ప్రతిమాట అవతల వ్యక్తి మనసుని తెలుసుకొని ఎలాంటి సంభాషణ అతనిని లేదా ఆమెని తృప్తిపరుస్తుందో తెలుసుకొని సంభాషించాలి. సకారాత్మకం స్వర్గం సకారాత్మకంగా ఆలోచిస్తే తప్ప కుటుంబములో సంతోష వాతావరణం ఉండదు. భర్తకు అణుగుణంగా భార్య, భార్యకు అణుగుణంగా భర్త, పిల్లలకు అనుగుణంగా ఒకరినొకరు గౌరవించుకోవాలి. మొండిగా తాను మాట్లాడేది సరైందని బాధించకూడదు. "యదా రాజ తదా ప్రజా" అన్నట్లు ముందు ఇంటి పెద్దలైన తల్లిదండ్రులు సకారాత్మకంగా ఆలోచిస్తే వారు మాట్లాడే ప్రతి మాట నమ్రత, అణుకువతో ఉండి తమ పిల్లలుకూడ అదే వాతావరణంలో పెరగడం వల్ల వారు కూడ సకారాత్మక భావనలలో ఎంత హుందాగా నమ్రతతో సంభాషిస్తారనడం నగ్నసత్యము. కుటుంబ వాతావరణము సానుకూలంగా ఉంటే ఇంటిలోని ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన పెంచుకొని జీవితాలను సార్థకం చేసుకొంటారనడం సత్యం.

మనసు బాగాలేనపుడు ఎప్పుడు అయినా ఆలోచించే విధానం వ్యతిరేకదోరణ కలిగి హింసను ఆచరిస్తాడు. అందువల్ల ప్రతి మనిషి తన సంబంధీకులు నుంచి బాంధవ్య వాతావరణం స్నేహపూర్వకంగాను, ప్రేమ భావంతో నిండి ఉండాలని భావించడం సహజం అందుకే ప్రతి గృహం స్వర్గం కావాలంటే ఇంటి వాతావరణం సకారాత్మకంగా ఉండి, బాంధవ్యాలను తను పలకరించే పలకరింపుతో నిండి ఉంటే మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. ఈ జీవన సాగరములో జీవితం అనే నావ

ఒడుదుడుకులు లేకుండ సాగిపోవాలంటే కుటుంబంలోని ప్రతివ్యక్తి సకారాత్మకం అనే వడ్డును ఉపయోగించాలి. నమ్రతతో కూడని సకారాత్మక సంభాషణ నైపుణ్యం ఇలలో స్వరాదామం.

అజాత శత్రువు కావడానికి ఆయుధం సకారాత్మక భావనతో కూడిన సంభాషణే మానసిక పరిపక్వత కుటుంబ పరిస్థితులపై ఆధారపడి ఉంటుందనడం సమంజసం. మహాపురుషుల జీవిత చరిత్రను గమనిస్తే ఉదహరించుకొనేవారి జీవన విధానం కుటుంబ వాతావరణం మలిచింది అనడంలో అతిశయోక్తిలేదు. చిన్నప్పటి నుంచి పిల్లల నీతికథలు సంస్కృతి సంప్రదాయ బద్ధమైన ఆధారాలు బోధిస్తూ ఉంటేవారి భవిష్యతే జీవన ఆధారంగా తయారుకావడం ఖాయం.

భారతీయ సంస్కృతి విభిన్నతను కలిగి విశిష్టమైన ప్రాశస్త్యాన్ని కలిగి ప్రపంచములోనే ఉత్కృష్టమైనది పేరుగాంచింది. వివేకానందుని సంస్కృతి సాంప్రదాయం ఆయన చికాగోలో ప్రపంచ సమ్మేళనంలో ప్రసంగించిన విధానంలో ఉట్టిపడింది. ఆహ్వానితులైన ప్రతినిధులను ఉద్దేశించి ప్రారంభించిన ప్రసంగము.

ప్రతి ఒక్కరిని ఆకట్టుకొందనడంలో అతిశయోక్తిలేదు. ఇది స్వామివివేకానందుని ఆధ్యాత్మిక పరిపక్వత సంభాషణ నైపుణ్యానికి నిదర్శనం కట్టమంచిరామలిగా రెడ్డిగారు ఆంధ్ర విశ్వవిద్యాలయ స్థాపకుడు, విద్యావేత్త, సాంఘిక సంస్కర్త గొప్ప వ్యక్తి తన ప్రసంగాలలో చాలా సార్లు సంభాషణ నైపుణ్యము గురించి చెప్పడం గమనార్హం.

స్వర్గం అనగానే ఆనందం అనుకొంటాం నరకం అంటే బాధతో నిండినది అనుకోవడం సహజం మనసుకు నచ్చి ఆనందాన్ని పొందితే స్వర్గ సుఖాన్ని పొందుతాము. అదే మనసు సరిగా లేక ఆందోళన, అలజడి కలిగితే నరకయాతనం అంటాం. స్వర్గానికి, నరకానికి మూల సంభాషణం. ఆ బాధలో ఆలోచనలు అనాగరికంగాను, అసహజంగాను ఉంటాయి. ఈ స్థితి నరకకూపం.

ప్రియం, అప్రియం రెండు మన మాటల అల్లికలో ఉన్నాయి. ప్రతి కుటుంబములోని సభ్యులు ఎప్పుడు ప్రియంగా మాట్లాడుకోవాలంటే కుటుంబ వాతావరణం ఎంతో ప్రశాంతంగాను, ఆహ్లాదకంగాను ఉండాలి. కుటుంబ పెద్దలు మిగితావారికి ఆదర్శంగా నిలవాలి. శాస్త్రీయంగా ఎంతోగానో అభివృద్ధి చెందాం జ్ఞానం ఆకాశమంత ఎత్తు పెరిగింది. కాని విజ్ఞానం పెరగకపోవడం శోచనీయం. విజ్ఞానంతో విచక్షణ జ్ఞానం పెరుగుతుంది. తద్వార మాటల్లోగాని చేతల్లోగాని పరిపక్వత స్పష్టంగా కనిపిస్తుంది. పరిపక్వత కలిగిన వ్యక్తి ఎవరైనగాని భార్యగాని, భర్తగాని, తల్లిగాని, తండ్రిగాని ప్రియమైన భాషణం కలిగివుంటారు.

మాట్లాడే ప్రతిమాట వెనుక మన మనోభావాలుంటాయి. చిరునవ్వుతో ప్రశాంతంగా మాట్లాడేవాడు ధ్యాని. మౌనంతోనే ప్రశాంతతను ప్రదర్శించేవాడు ముని సంజ్ఞలు కూడ సముచితంగా చూపే పలకరింపు ఆకర్షితంగా ఉంటుంది.

మానవుడు ఎంతో ఎత్తుకు ఎదిగి తన జీవితాన్ని సుఖమయం చేసుకోవడానికి సకల ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈనాడు అభివృద్ధికి అవదులులేవు. అయినా భార్యను భర్తగాని, భర్తను భార్యగాని సరైన అవగాహన పెంచుకోవడం లేదంటే ఎంత సిగ్గుచేటో! జీవితాన్ని ప్రాపంచికంవైపు నుంచి ఆధ్యాత్మికంవైపు మరల్చాలంటే జీవిత భాగస్వామి సమన్వయం ఎంతో అవసరము కదా!

స్వర్గమయిన మాట తీరుతోనే ఉంది నరకమైన మాట పరంపరలోనే ఉంది. భర్త జీవితం భార్య మాట తీరులోను, భార్య జీవితం భర్త మాటతీరులోను ఉంటుందంటే సరైందేకదా!

# ఆది గురువు ఆచార్య శంకరులు

- శ్రీమతి జానమద్ది స్వర్ణలతా జోషి

(గత సంచిక తరువాయి)

**ఆచార్యులకు భట్టపాదుల గురించి తెలిసిందిఎక్కడ ?**

మాధవీయంలో ఆచార్యులు భట్టును కలవడానికి, జయించడానికి ముందుగా ప్రయాగకు వచ్చారని (ప్రయాగ మార్గాత్ ప్రథమం జిగీషుః కుమారిలం సాధిత కర్మజాలమ్) చెప్పబడింది.

చిద్విలాసీయంలో ఆచార్యులు కాశీలో వుంటూ దుర్మతులను ఖండిస్తూ ఆ వాదులను అద్వైతం వైపుకు మరలుస్తూ వున్నప్పుడు ఒక బ్రాహ్మణుడు భౌద్ధుల నుండి శిక్షణ పొంది వారి మతాన్నే ఖండిస్తున్నాడు' అని చెప్పాడు. ఆ మాట విన్న ఆచార్యులు ఆ బ్రాహ్మణుడితో బాటు రుద్ధానగరానికి వచ్చాడని కూడా చెప్పబడింది.

అనంతానంద గిరీయంలో ఆచార్యులు శ్రీశైలంలో ఒక నెలపాటు వున్నారని అప్పుడు రుద్ధనగరం నుండి బ్రాహ్మణులు వచ్చి 'భట్టాచార్యుడనే బ్రాహ్మణ శ్రేష్ఠుడు ఉత్తరదేశం నుండి వచ్చి, దుష్టమతావలంబులైన అగణిత జైనులను అనేక విద్యా ప్రసంగములతో జయించి రాజు సహాయంతో వాటిని అణచివేస్తూ నిర్భయంగా వున్నాడు' అని చెప్పారని, ఆ అద్భుత సమాచారాన్ని విన్న ఆచార్యులు శిష్య సమేతులై రుద్ధనగరానికి వచ్చారని చెప్పబడింది. ఇలా ఆయనకు కుమారిల భట్టు గురించి తెలిసింది ప్రయాగలోనని, అదికాదు శ్రీశైలంలోనని విభిన్న అభిప్రాయాలున్నాయి.

**ప్రాయశ్చిత్తానికి కుమారిలభట్టు చేసిన పాపం ఏమిటి?**

ఈ సంఘటన గురించి కూడా భిన్నాభిప్రాయాలున్నాయి. ఒక్క మాధవీయంలోనే ఒక్కోచోట ఒక్కోలాగా వుంది. మొదటి సర్గలో ఇలా వుంది. భట్టుసుధన్వుడనే రాజు సమక్షంలో తన వాదంతో వారిని గెలిచాడు. రాజు వైదిక పక్షపాతి అయినప్పటికీ కృత్రిమ శ్రద్ధతో వారిని అనుసరించాడు. గెలుపు, ఓటమి విద్యకు అధీనమై వుంటాయని ఆయన భావన. అందువల్ల 'కొండ చివరి నుండి క్రిందకు దూకినప్పటికీ ఎవరికి అపాయం కలుగదో వారి మతమే నిత్యమని, సత్యమని నమ్మవచ్చు' అని అన్నాడట. అది విన్న బౌద్ధులు ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారని, కాని కుమారిల భట్టు 'వేదాలు ప్రమాణమైతే నాకు ఏ అపాయము జరుగకుండు గాక' అని చెప్పి క్రిందకు దూకాడట. ఎలాంటి గాయమూ తగులక తానే గెలిచాడని చెప్పబడింది. అదే కావ్యంలోని ఏడవ సర్గలో బౌద్ధులే ఆయనను క్రిందకు తోశారని చెప్పబడింది. అంతేకాక దాంతో ఆయనకు ఒక కన్నుకూడా పోయిందని చెప్పబడింది. వేద ప్రామాణ్యాన్ని శంకించడం తప్పని కూడా చెప్పబడింది. బౌద్ధులు 'మత నిర్ణయానికి ఇది సరియైన ప్రమాణం కాదని, మణిమంత్ర, ఔషధముల చేత దేహ రక్షణ చేసుకోవచ్చునని చెప్పినప్పటికీ రాజు ఒక కడవలో పామునుపెట్టి 'ఇందులో ఏముంది, సరియైన సమాధానం చెప్పని వారిని గానుగలో వేయిస్తాను' అని చెప్పాడని వ్రాయబడింది. దీనిని గమనిస్తే రాజు విద్యాపక్షపాతి కాదని తెలుస్తుంది.

బౌద్ధులు తపస్సు ద్వారా 'అందులో పాముంది'

అన్నారు. భట్టు అందులో 'సర్పశయనుడైన విష్ణువు వున్నాడని ' చెప్పాడు. ఈశ్వరుడు నిరాకరించాడని - ఈ రెండు తప్పులకు ప్రాయశ్చిత్తం చేసుకుంటున్నానని చెప్పిన విషయాలు సత్యదూరమనిపిస్తుంది. కాని ఒకటవ సర్గలో కుమారిల భట్టు బౌద్ధులను తన వాదంతో గెలిచాడు కాని గురుద్రోహం చేయలేదు. పరమాత్ముడిని అంగీకరిస్తూ విష్ణువు కడవలో వున్నాడన్నాడు. కాని ఈశ్వరుని నిరాకరించలేదు. ఇది మాధవీయానికే కాదు వస్తుస్థితికి కూడా విరుద్ధమే. ఎందుకంటే 'శ్లోకవార్తిక'లో ఇలా చెప్పబడింది. "ప్రాయేణైవహి మీ మాంసా లోకే లోకాయతీకృతా"। తామాస్తిక పథే నేతుమయు యత్నః కృతో మయా" అంటే ప్రపంచంలో మీ మాంసా శాస్త్రమును లోకాయత దర్శనమంటారు. దానిని ఆస్తిక మార్గంవైపుకు మళ్ళించడానికే ఈ ప్రయత్నం అని ఈ శ్లోక భావం అదే గ్రంథంలోని మొదటి మంగళ శ్లోకంలో ' విశుద్ధ జ్ఞాన దేహాయ త్రివేదీ దివ్య చక్షుషే। శ్రేయః ప్రాప్తి నిమిత్తాయ నమః సోమార్ధధాలిణే' అని చంద్రశేఖరుని స్తుతించారని కూడా చెప్పబడింది.

చిద్విలాసీయంలో భట్టు బౌద్ధులతోబాటు గురుకులవాసం చేశాడని చెప్పబడింది కాని పై నుండి తోయబడ్డాడని లేదు. 'నీ కంట్లో నీళ్ళెందుకు వచ్చాయి అన్న బౌద్ధుల ప్రశ్నకు ఆయన 'మీ గురువుగారి యుక్తి విని ఆనందంతో' అని చెప్పాడట. (యుక్తిరాకర్ణ్య నిర్ణిక్తా భవద్దేశిక నిర్మితాః। సముద్యన్నిర్భరానంద తుందిలా వశ చేతనః। నినస్రురశ్రు వ్యాజేన బహిరానంద బిందవః॥) దానిని బట్టి ఆయన బ్రాహ్మణుడని గ్రహించి బౌద్ధులు తమకు తామే ఆయనకు దూరమయ్యారట. వాదంలో బౌద్ధులను గెలిచి రాజు చేత వారి తలలు తీయించారట. (విజ్ఞాప్య తన్మహీశ్చరమ్ శిరాంసి చ్ఛేదయామాస సౌగతానాం సమంతతః) అని చెప్పబడింది. ఇక్కడ రాజాజ్ఞచేత బౌద్ధులకు శిరచ్ఛేదనం చేయించారన్నది గమనింపదగిన విషయం. మాధవీయంలో అన్ని పరీక్షలలోనూ కుమారిలభట్టుకు అశరీరవాణి బల నుండి జయం లభించాక, 'ఆ సేతోవాతుషారాద్రేః బౌద్ధానా వృద్ధ బాలకమ్। న హంతి యః స హన్తవ్యో భృత్యా నిత్యన్వశాన్నృపః (ఆ సేతు హిమాచలం దాకా వున్న బౌద్ధ ముదుసలులను బాలురను శిరచ్ఛేదనం చేయనివాడిని చంపవలెను) అని రాజాజ్ఞగా చెప్పబడింది. అనంతానందగిరీయంలో కూడా ఇంచుమించు ఇలాగే వర్ణింపబడింది. ఇలా హిందువుల హింసవల్లనే బౌద్ధమతం భరతఖండంలో క్షీణించిందని చెప్పడానికి వారి దగ్గర కూడా సరియైన ప్రమాణం లేదు.

ఆచార్యులు భట్టును దర్శించినప్పుడు ఆయన తషాగ్ని మద్యలో వున్నడని, ప్రభాకరుడు మొ॥ శిష్యులు కన్నీళ్ళు కార్చారని మాధవీయంలో చెప్పబడింది. అలా ఆయన రుద్ధపురిలో ప్రాయశ్చిత్తం చేసుకున్నాడని ఒక అభిప్రాయమైతే, ఆంధ్రప్రదేశ్‌లోని పెనుగొండ సమీపంలోని 'రొద్దం' అన్న ప్రదేశమని మంచి అభిప్రాయముంది.

(సశేషం)

- నైపుణ్యం నిప్పకణమైతే నిర్లక్ష్యం నీటిచుక్క.
- కావాలంటే క్రూరజంతువులను పెంచుకో! అవి పెంచిన వారిని ఏమీ చేయవు. కాని, నీలో అహాన్ని మాత్రం పెంచకు. ఎందుకంటే అది పెంచినవాడి ఔన్నత్యాన్నే ఆహారంగా తీసుకుంటుంది.

# యోగవాసిష్ఠ కథాలహరి

డా॥ ధారారామనాథశాస్త్రి, ఒంగోలు

## ఇద్దరు రాజులు - రెండు తపో మార్గాలు

హిమాలయ పర్వత సానువులలో హేమజటులు అనే పేరుగల ఒక కిరాత జాతి ఉండేది. వారు కష్టజీవులు. నిరంతర వ్యాసంగం కలిగి కిరాత రాజ్యాలన్నిటిలోకి తమ రాజ్యం ఉత్తమంగా ఉండాలని పరిశ్రమిస్తుంటారు. ఫలితాన్ని సాధిస్తున్నారు. వారి ఏలిక సురఘుడు. బుద్ధికి బృహస్పతి, శౌర్యానికి షణ్ముఖుడు. చాలాకాలం ధర్మోత్తరంగా రాజ్యాన్ని పరిపాలిస్తున్న ఆ రాజుకు ఉన్నట్టుండి మనస్సులో ఒక చింత కలిగి అది బాగా బలవత్తరమై అతన్ని బాధింపసాగింది. ఏమిటంటే ? నేను రాజుగా నా కర్తవ్యం నెరవేర్చడంలో శత్రుదండనము, మిత్రానుగ్రహము అనే పనులు నిరంతరం చేస్తున్నాను. మొదటి దానివల్ల ఖేదము, రెండవ దానివల్ల మోదము అనుభవిస్తున్నాను. ఈ రెంటికీ అతీతమైన సమత్వస్థితి లేదా? ఉంటే అది ఎలా సాధ్యం ? ఇలాంటి చింతలతో బాధపడుచున్న సురఘుని దగ్గరకు సుగృహీత నామధేయుడు, బ్రహ్మజ్ఞాన సంపన్నుడు అయిన మాండవ్య మహర్షి విచ్చేశారు. రాజు మహర్షికి సర్వ గౌరవాలూ సమర్పించి తన మదిలోని చింత తెలుపుకొని పరిష్కార మార్గం ఉపదేశించ వలసిందిగా ప్రార్థించాడు. మహర్షి కొంతసేపు ధ్యానించి 'రాజా నీకొక మార్గం ఉపదేశిస్తాను. సాధన చేసి తరించు. నా ఉపదేశంలో కేవలం శబ్దమయదృష్టి ఉంటుంది. అంటే మాటలు మంత్రాలు వగైరా. నీ సాధనవల్ల సాక్షాత్తు జ్ఞానం లభిస్తుంది. మొదటి పెద్దల మంచి మాటలు విను. అంటే శ్రవణం చేయి. ఆ తరువాత మననం చేయి. అంటే ఆలోచన చేయి. క్రమంగా ధ్యానము మొదలైన సోపానాలు అధిరోహించు. స్వాత్మబోధ కలుగుతుంది. తరువాత క్రమంగా వైరాగ్యము, జ్ఞానము, సమాధి మొదలైనవి సిద్ధిస్తాయి. అలా మాండవ్య మహర్షి చేసిన ఉపదేశాన్ని అక్షరశః ఆచరించి అంచెలంచెలు అధిరోహించి దేహాత్మ భ్రాంతి నశించిన సురఘుడు బ్రహ్మజ్ఞాన సంపన్నుడైనాడు.

ఇలా సురఘుని వృత్తాంతాన్ని కథగా చెబుతున్న శ్రీవసిష్ఠులతో రాముడు అంటున్నాడు. మహాత్మా మీరు చెప్పిన కథ బాగుంది. చిన్న సందేహం. వాయువుచేత కొట్టబడిన నెమలి యీకలాగ చలించిపోయే యీ మనస్సును ఏకమైన పరబ్రహ్మమునందు నిలపడం ఎలాగ ? అలా నిలపడం వల్ల వచ్చే సమాధి ఎలాంటిది ?

వసిష్ఠులు ప్రవచిస్తున్నారు. రామా - ఇంకో చిన్న కథ చెబుతాను అవధరించు. పారశీక రాజ్యాన్ని పరిఘుడు అనే రాజు పరిపాలిస్తున్నాడు. అతడు కూడా సురఘునిలాగే సమస్త సద్గుణ సంపన్నుడు. పైగా వారిద్దరు మంచి మిత్రులు. అప్పుడప్పుడూ కలుసుకొని మంచి చెడ్డలు మాట్లాడుకుంటుండే వారు. ఇలా ఉండగా రామప్రభూ! పారశీకంలో ఒక పెద్ద కఱవు వచ్చింది. అనావృష్టి, ధారిద్ర్యము విలయతాండవం చేస్తున్నవి. దేశంలో ప్రాప్తించిన యీ దీనస్థితిని చూచి బాధపడిన పారశీక రాజు రాజ్యం వదలి వెళ్ళిపోయాడు. కొండ గుహలను ఆశ్రయించి ఎండనక, వాననక, ఆకులలములు తింటూ చిరకాలం తపస్సు చేశాడు. ఆ దశలో అతనికి ఆకులలములు అందునా ఎండినవి

తినడంచేత పర్ణాదుడనే సార్థకనామం కలిగింది. తీవ్రతపస్సు ఫలించి పరిఘునికి బ్రహ్మజ్ఞానం సిద్ధించింది. ఆనంద కందళితమైన చిత్తంతో పరిఘుడు ఏకాయెకి తనమిత్రుడైన సురఘుని చూడాలని వచ్చాడు. ఇద్దరు బ్రహ్మజ్ఞానులైన రాజమిత్రుల మధ్య కుశల సంప్రశ్నములు అతిథి మర్యాదలూ గడిచాయి. ఓనాడు వారిద్దరి మధ్యా తాత్త్వికమైన సంభాషణ యిలా సాగింది.

మిత్రమా, సురఘా! నీవు ఎలా మాండవ్య మహర్షి చేత ప్రబోధితుడవై తపశ్చర్య చేపట్టి జ్ఞానివైనావో నేనున్నూ ఈశ్వరు నారాధించి ఆయన అనుగ్రహంచేత జ్ఞానప్రాప్తిని పొందాను. ఇప్పుడు నీవు దుఃఖరహితుడవై మేరువుమీద హాయిగా కూర్చున్న రాజులాగ బ్రహ్మములో విశ్రాంతి పొందావా! మిత్రమా సంకల్ప రహితము పరమ విశ్రాంతి స్థానము అన్ని సాంసారిక సుఖాలకూ అతీతము అయిన సమాధిని మీరు అనుష్ఠిస్తున్నారా ?

'మిత్రమా పరిఘా ఆత్మయందు స్థితి కలిగి ప్రబుద్ధ చిత్తులై జ్ఞానులెవరైతే ఉంటారో వారు నిత్యమూ జగత్క్రియలను ఆచరిస్తూ కర్మశాలురై ఉన్నాసరే వారు సమాధిలో ఉన్నట్లే.'

'మిత్రమా మరికొంత వివరించు'' పరిఘా - సమస్తమైన ఆశలు గడ్డి పరకల్లాంటివి. వాటి పాలిటి అగ్నివంటిది ఆత్మజ్ఞానం. అలాంటి జ్ఞానాన్ని కలిగిన స్థితినే సమాధి అన్నారు కానీ అది కేవలం నిష్క్రియకాదు. ఊరకే ఉండే తూష్ణీంస్థితీ కాదు. ఆలోచించు. ఈ మాటలు విన్న పారశీక ప్రభువు ఒక్కసారి చలించిపోయాడు. వెంటనే హుటాహుటి రాజ్యానికి వెళ్లాడు. □

---

➢ 8 వ పేజి తరువాయి ......

అపౌరుషేయ సంహితలే తెలుపుటకు యోగ్యమైనవి. ఋషిగణము ఆ సంహితలకు ద్రష్టలు, ప్రయోక్తలు, మరియు వ్యాఖ్యాతలు మాత్రమే యై యున్నారు. యజ్ఞములు బ్రహ్మయొక్క ప్రతినిధులని నాలుగు వేదములందును దెలుపబడియున్నది. ఈ నాల్గువేదములలో పరమేశ్వరుని జ్ఞానము కలదు. అందుచే నవి నిత్యములై యున్నవి. ఆ మంత్రముల సాక్షాత్కారము ఋషులు జేసికొనియుండిరి. కావున ఆదరార్థము ఆ ఋషుల పేర్లను మంత్రములపైన వ్రాయుబడుచున్నది. యూరోపువానులును అథర్వవేదమును అర్వాచీనమనుట వారి అత్యంత వివేకరహితమునే చాటుచున్నది. ఈ నాల్గు వేదములును సార్వకాలిక, సార్వజనీన, సార్వభౌమిక సిద్ధాంతములతో పరిపూర్ణమై యుండుటవల్ల కల్యాణకారకములై యున్నవి.

ఆ పరమ పితయగు జగదీశ్వరునకు అనేక ధన్యవాదములు. ఆయన విశ్వకల్యాణమునకై సృష్ట్యాదియందు తన నిర్దుష్ట నియమములను ఈ నాలుగు వేదముల ద్వారా ప్రకాశపరచినాడు. ఈ నాలుగు వేదములలో ప్రాపంచిక వ్యవహారముల ద్వారా పరమాత్మ జ్ఞానము, అట్టి ఆజ్ఞానము ద్వారా ప్రాపంచిక వ్యవహారము ఉపదేశమొనర్చబడినది. ప్రపంచమున కేవలమీ రెండే ముఖ్య పదార్థములై యున్నవి. వీని యథార్థప్రాప్తి, మరియు అనుభవములందే మానవులందరి యున్నతి యాధారపడియున్నది. ఈ నాలుగు వేదముల మంత్ర రచనా విధానమునే 'త్రయీవిద్య' అనెదరు. ఈశ్వరీయ చతుర్వేదములలోని జ్ఞాన కర్మ ఉపాసనల ద్వారానే విశ్వమునకు ఉపకారమొనర్చుట జరుగును. □

# గొప్పలు నావే ..... తప్పలు ఇతరులవి...

సేకరణ, రచన : శింగల్‌రెడ్డి ఈశ్వరరెడ్డి,యం.ఏ బ్రహ్మంగారిమఠం, సెల్ : 9440426300

ప్రతి మనిషి తనను గురించి, తాను చేసిన పనిని గురించి గొప్పలు చెప్పుకోవటం చూస్తుంటాం. కాని అందులో పొరబాట్లు ఉంటే వాటిని స్వీకరించరు. ఈ శరీరం మనకు దైవమిచ్చిందే. దాన్ని సక్రమమైన వాటికే వినియోగించుకోవాలి. శరీరంలోని పంచేంద్రియాలకు ఒక్కొక్కరు అధిష్టాన దేవతలుంటారు. కన్నుచేసిన తప్పు. తనది కాదని దాని అధిష్టానదేవత దేనని, చేయి చేసిన తప్పు తనదికాదని ప్రేరేపించిన అధిష్టానదేవతదని తప్పించుకునే వారు కొందరుంటారు. అలాంటి సంఘటన రామకృష్ణపరమహంస తన శిష్యులకు ఒక చక్కని కథాద్వారా వివరించారు. ఆ కథ సారాంశము ఇది.

ఒక బ్రాహ్మణుడు వేదాంగ పారంగతుడు. భక్తినిష్టలు కలిగినవాడు. తన తోటలో వివిధ రకాల పండ్లచెట్లను, పూలమొక్కలను పెంచాడు. ఆ తోట ఎంతో అందంగా ఆకర్షణీయంగా తయారైంది. ప్రతి రోజు పూలు కోసి, పండ్లను దేవునికి నివేదనగా సమర్పించేవాడు. ఒకరోజు ఆ తోట ద్వారం మార్గం మూయటం మరిచిపోయాడు. ఒక ఆవు తోటలో ప్రవేశించింది. అక్కడ ఉండే పూల మొక్కలన్నిటిని చిగుళ్ళతో సహా తినేసింది మరుసటి రోజు బ్రాహ్మణుడు తోటను చూసి దుఃఖించాడు. ఎవరు ఆ పనిచేశారని చూడగా ఆ తోటలో ఆవు మేస్తూవుంది. ఇంకేముంది. దుఃఖం కాస్త ఆవేశం, కోపంగా మారింది. ఇన్ని రోజులు ఎంతో కష్టపడి పెంచిన తోటను ఒక్కరోజులో సర్వనాశనం చేసిన ఆవును ఒక బడితె తీసికొని చావమోదాడు. ఆవు పరుగెత్తుతున్నా వదలక బడితె పూజ చేశాడు. చివరకు ఆయువు పట్టులో దెబ్బతిని ఆవు అంబా అంటూ కూలిపోయి చనిపోయింది.

చచ్చిన ఆవును చూసి బ్రాహ్మణుని కోపం చల్లబడిపోయింది. మనసులో ఏదో భయం చోటు చేసుకొంది. గోహత్యను చేసి పాతకుడయ్యానని దిగులు పడ్డాడు. గోహత్యా పాతక నివారణను గురించి ఆలోచించాడు. తాను వేద పురాణాలు చదివినందున మరొక కోణంలో ఆలోచించాడు. మనిషికి ఉన్న ఇంద్రియాలు కొందరు ప్రత్యేక దేవతల ద్వారా శక్తిని పొందుతాయని తెలుసు. కాబట్టి తాను చూసిన కంటికి సూర్యుని ద్వారా, వినేశక్తి దిగ్దేవతద్వారా చేతులకు శక్తి యింద్రుని ద్వారా లభిస్తాయని జ్ఞప్తి చేసుకున్నాడు. ఆవును చంపింది చేతులు. కాబట్టి చేతులకు శక్తినిచ్చిన ఆ యింద్రునిదే ఈ గోహత్యా పాతకం అనుకొని స్థిమిత పడ్డాడు.

ఇంతలో గోహత్యా పాతకం అతనిలో ప్రవేశించడానికి వచ్చింది. అప్పుడు బ్రాహ్మణుడు ఆ పాపంనాదికాదు. ఇంద్రునిది. కాబట్టి వెళ్లి ఆయనలో ప్రవేశించు అన్నాడు.ఆ పాతకం యింద్రుని వద్దకు వెళ్ళింది. ఇంద్రుడు ఆశ్చర్య పడ్డాడు. నేను బ్రాహ్మణునితో మాట్లాడి వస్తాను. తర్వాత అవసరమైతే నాలో ప్రవేశింపవచ్చు అని పాతకంతో చెప్పి ఇంద్రుడు బ్రాహ్మణుని తోటకు వచ్చాడు మారువేషంతో.

➢ తరువాయి 33 వ పేజిలో.......

గీతా సుధ

# భగవద్గీతకు భాసుర భాష్యం



డా॥ రాధశ్రీ, కర్నూలు, ఫోన్: 9494481210

(గత సంచిక తరువాయి)

**క్లేశో౽ధికతరస్తేషామ్ అవ్యక్తాసక్తచేతసామ్।**
**అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే ॥ (12-05)**

దీనికి ఒకేఒక్క అడ్డదారి ఏమిటంటే "పనిమీద మనసును లగ్నం" చేయడమే. కాబట్టి కృష్ణుడు మరలా అర్జునుని "ఓ అర్జునా ఎవరైతే అన్ని శక్తియుక్తులను నా (పని) యందే లగ్నం చేస్తారో వారి సంగతి నేను చూచుకుంటాను (పనే చూచుకుంటుంది). (సరిగా పని చేస్తే బ్రతికినంత కాలం భుక్తి ఆ తర్వాత చెదరని కీర్తికాయం ఉంటాయి. ఇంతకన్నా ఎవరైనా ఏమికోరుకుంటారు?)

**యే తు సర్వాణి కర్మాణి మయి సన్న్యస్య మత్పరాః।**
**అనన్యేనైవ యోగేన మాం ధ్యాయంత ఉపాసతే ॥ (12-06)**

అలాంటి వారిని మృత్యుసాగరం నుండి నేను తప్పించి రక్షిస్తాను.

**తేషామహం సముద్ధర్తా మృత్యుసంసారసాగరాత్।**
**భవామి నచిరాత్ పార్థ మయ్యావేశితచేతసామ్ ॥ (12-07)**

మరణం నుండి తప్పిస్తానని కృష్ణుడు (పని) (కర్మ) చెప్పడం చాలా సముచితం. కోటాను కోట్ల జీవరాసులు ఈ ప్రపంచంలో పుట్టి, పెరిగి నశిస్తున్నాయి. ఎందరో మానవులు ప్రతి రోజూ పుట్టి, నశించి పంచభూతాలలో కలిసిపోతున్నారు. కాని కృష్ణుడు (పని) కొందరికి మరణం లేకుండా చేశాడు. నన్నయ, తిక్కన, ఎర్రన, పోతన, ... న్యూటన్, అనగ్జాగరస్, డెమాక్రటిస్, సోక్రటిస్, సోఫిక్లిస్, థేలిస్, షేక్స్పియర్, వీరబ్రహ్మం, షిర్డి సాయి.. వీళ్లకు జననమే తప్ప మరణం లేదు. వారిని వారిలోని కృష్ణుడు (పనితనం) మరణం నుంచి తప్పించడం జరిగింది. కాబట్టి ఓ అర్జునా నీవు నా యందే (పని యందే) మనస్సునులగ్నం చేసి నీ బుద్ధినంతా నా యందే (పనియందే) ఉంచినట్లైతే నీవు నా యందే (పనియందే) నివసించగలవు అనుటలో సందేహం లేదు.

**మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ।**
**నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః (12-08)**

పనిలో నివసించాడు అంటే మరణాన్ని జయించినట్లే. రొటీన్ సంసార వలయంలో నుండి బయటపడినట్లే

ఈ చక్రంలో నుండి బయట పడడం అంత తేలికకాదు. బయట పడితే మాత్రం (ఏ దశలోనైనా బయటపడవచ్చు) మరణాన్ని జయించినట్లే. దీన్నే ధూర్జటి చాలా బాగా వివరించాడు.

**ఆలంచున్ మెడగట్టి దానికి అపస్య శ్రేణిగల్పించి, త**
**ద్బాల వ్రాతమునిచ్చి పుచ్చుకొను సంబంధంబు గొంచి, ఈ**
**మాలార్కంబున బాంధవంబనెడి ప్రేమన్ గొందరం ద్రిప్పగా**
**సీలన్ సీలయమర్చినట్లొ సగితో శ్రీకాళహస్తీశ్వరా**

"ఒక వేళ నీవు మనస్సును పనియందే (నాయందే) లగ్నం చేయలేకపోతే అభ్యాసం (ప్రాక్టీస్) చేయి. అభ్యాసం చేస్తే మనస్సును నా యందే (పనియందే)

నిలుస్తుంది. సంపదలను జయించిన ఓ అర్జునా నీవు సాధన చెయ్యి'' అన్నాడు కృష్ణుడు.

**అనగననగ రాగ మతిశయిల్లుచు నుండు**
**తినగ తినగ వేము తియ్యనుండు**
**సాధనమున పనులు సమకూరు ధరలోన**
**విశ్వదాభిరామ వినుర వేమా ....**

అన్న వేమన పద్యం కూడా గీతా సందేశమే నన్నమాట.

**అథ చిత్తం సమాధాతుం న శక్నోషి మయి స్థిరమ్ ।**
**అభ్యాసయోగేన తతో మామిచ్ఛాప్తుం ధనంజయ ॥ (12-09)**

ఒక వేళ నీవు అభ్యాసం ప్రత్యేకంగా చేయలేకపోతే నీపని నీవు చేసుకుంటూ పోతే పరిపూర్ణ స్థితిని పొందుతావు.

**అభ్యాసేఽప్యసమర్థోఽసి మత్కర్మపరమో భవ ।**
**మదర్థమపి కర్మాణి కుర్వన్ సిద్ధిమవాప్స్యసి ॥ (12-10)**

ఇదికూడా ఈ నాటికీ జరుగుచున్న నిత్య సత్యమే. ఏదైనా ఉద్యోగం లో చేరిన ఉద్యోగులకు ''ఉద్యోగుల శిక్షణా శాల''లో ''శిక్షణ'' ఇస్తారు. అన్ని విషయాలు క్షుణ్ణంగా అనుభవజ్ఞులైన ఉపన్యాసకులు చెబుతారు. కానీ కొందరు ఉద్యోగులకు ఆ అవకాశం రాదు. అయినా వారు కూడా తమ తమ దైనందిన అనుభవాల ద్వారా పనిచేసీ, చేసీ పరిపూర్ణులవుతారు. అంటే థీరెటికల్‌గా చెప్పేకంటే (క్లాస్ రూం పాఠాలకంటే) ప్రాక్టికల్ జీవితంలో ( ఆ ప్రత్యేక పదవిలో కూర్చున్నప్పుడే) మనిషి విషయాలను తెలుసుకోగలుగుతాడు. (అందుకే గీత సమకాలీన సత్యాలనేగాక సార్వకాలీన సత్యాలను చెబుతూ అమరంగా బాషిస్తున్నది.

ఒకవేళ నీవు అది కూడా చేయడానికి అశక్తుడవైతే ఆ పని ఫలితాన్ని కూడా విడచి పెట్టి ఆత్మ నిగ్రహంతో ఉండు. అంటే ఈ రంగం మనకు పనికిరాదు అనుకొని మరో రంగాన్ని ఎంచుకో.

**అథైతదప్యశక్తో...సి కర్తుం మద్యోగమాశ్రితః।**
**సర్వకర్మఫలత్యాగం తతః కురు యతాత్మవాన్ ॥ (12-11)**

ఒక విషయంలో అపజయంపొంది నంత మాత్రాన అంతటితో అంతా అయిపోయిందని డీలాపడి, నిరాశా నిస్పృహలకు లోనై, భార్యాపిల్లలను (తేలికగా దొరికేది వాళ్లే) హింసించి, హత్య చేసి తానూ ఆత్మహత్య చేసుకునేవారికి ఎందరికో గీతలోని ఈ శ్లోకం కనువిప్పు కలిగిస్తుంది.

విద్యార్థికి అయిదారు వలయాలు (రింగులు) ఇస్తారు. అతణ్ణి ఆలక్ష్యం మీదవడేటట్లు వేయమంటారు. 6వ పాయింటు దగ్గర నుండి ఒక రింగు విసిరితే అది పడకపోతే అంతకన్నా దగ్గరి పాయింటు నుండి, అవసరమైతే మరీ దగ్గర నుండీ వేయమంటారు. అలాగే అతి దగ్గరి పాయింటు నుండి వేసిన వ్యక్తిని అంతకన్నా దూరంగా ఉండే పాయింటు నుండీ వేయమంటారు. ఏ పాయింటు దగ్గరి నుండి వేస్తే అన్ని రూపాయల పందెం పెడతారు. అన్ని రూపాయలు యిస్తారు. ఇక్కడ ఎన్ని రూపాయలు గెలిచారు అన్నది కాదు ముఖ్యం. అతడు తన శక్తియుక్తులను అర్థం చేసుకొని పాయింటు నుండీ పాయింటుకు మారుతున్నడా లేదా అనేదే పరిశీలన. అంటే ఒక వ్యక్తి ఉదాహరణకు ఆరు ఫోటో స్టూడియోలు నడుపుతున్నాడనుకోండి. ఒక దాంట్లో నష్టం వస్తే దాన్ని మూసేసి మిగతా అయిదే నడుపుకుంటాడు. ఇంకోదాంట్లో కూడా నష్టమే వస్తే దాన్ని మూసేయాల్సిందే. అలాగే అన్ని (6) స్టూడియోలలోనూ నష్టమే వస్తుంటే అతను మరో వ్యాపారం గురించి ఆలోచించుకోవాలి. అలాగే 3

స్టూడియోలు నడుపుతున్న వ్యక్తికి మూడింటి లోనూ లాభం వస్తే "హమ్మయ్య" అని తృప్తిగా కూర్చోకూడదు. 4వ యూనిట్టుకు, అక్కడా లాభం వస్తే, మరో యూనిట్టు ప్రారంభించడానికి ప్రయత్నించాలి. (అంటే చివరకు మేనేజ్‌మెంటు కోర్సుల్లో చెప్పేది కూడా గీతాసారంశమే. అందుకే కృష్ణుడు "అదికాకపోతే ఇది, ఇదికాకపోతే అది. ఏదీ రాకపోతే ఏదో ఒకటి చెయ్యి" అంటున్నాడు. ఒక వేళ ఏదీ రాకపోతే మరలా నిన్ను నీవు తెలుసుకో (ఆత్మ జ్ఞానం పొందు) నీవు ఏ పనిలో రాణించగలవో తెలుసుకో దాని కోసం ధ్యానం చేయి. అవసరమైతే కర్మఫల త్యాగం చేయి. కానీ ఆత్మన్యూనతాభావం వద్దు. ఆత్మహత్యలు చేసుకోవద్దు అంటూ ధైర్యం నూరిపోస్తున్నాడు కృష్ణుడు.

**శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే।**
**ధ్యానాత్ కర్మఫలత్యాగః త్యాగాచ్ఛాంతిరనంతరమ్ ॥** (12-12)

ద్వేషంలేనివాడు, జీవులందరికీ దయగల మిత్రుడు కరుణగల వాడు, స్వార్థంలేనివాడు, అహంకారం లేనివాడు, సుఖదుఃఖాలను సమంగా భావించేవాడు క్షమగలవాడు నాకు ప్రియతముడు.

**అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ।**
**నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ ॥** (12-13)

సంతృప్తిగలవాడు, ఎప్పుడూ పనిచేయడంలో ఆసక్తిగలవాడు, ఆత్మనిగ్రహం కలవాడు, స్థిర నిశ్చయంగలవాడు, నిశ్చయంతో తన మనస్సును బుద్ధిని నాయందే (పనియందే) నిలుపువాడు నాకు ఇష్టుడు.

**సంతుష్ట స్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః।**
**మయ్యర్పితమనోబుద్ధిః యో మద్భక్తస్స మే ప్రియః ॥** (12-14)

ఎంత మంచి మాట చెప్పాడో చూడండి! తృప్తిలేనివాడు ఉత్తముడుకాడు, విజయుడుగాడు. 'కోటి' వున్నవాడు "కోటే వున్నది ఇది పదికోట్లు కావాలి" అనుకుంటూ అనుచిత కార్యాలు చేస్తూ నానా గడ్డీతిని, అక్రమమైన మార్గాలు త్రొక్కి, దాని ద్వారా నిద్ర పట్టక, రోగం వచ్చి, డాక్టర్ల పాలైవున్న కోట్లతో బాటు ఆరోగ్యాన్నీ పోగొట్టుకుంటాడు. కాబట్టి "ఆత్మతృప్తి" ఎంతో అవసరం. ధర్మంగా గడిపిన పది రూపాయల్లో ఏ రెండు మూడు రూపాయలో కష్ట కాలం కోసం దాచుకొని, మిగిలిన దాన్నే జాగ్రత్తగా ఖర్చుపెట్టుకునేవాడు హాయిగా మంచి నిద్రపోతూ, చింతలు లేకుండా హాయిగా ఎక్కువ కాలం జీవిస్తాడు.

**కం.॥ వ్యాప్తిం బొందక, వగవక**
**ప్రాప్తించిన లేశమైన పదివేలనుచున్**
**తృప్తించెందని మనుజుడు**
**సప్తద్వీపంబులందు చక్కంబడునే ?**

**(పోతన భాగవతం. వామనావతారం)**

భాగవతంలో కృష్ణుడు చెప్పిన మాటలో కూడా ఉన్నది గీతాసారమే. నిజం చెప్పాలంటే అద్వైతానికి ఉదాహరణ గీత మాత్రమే. ఎవరు ఏమంచి మాట చెప్పినా అది గీతా సారాంశమే. "ఒక్కగీత మీ జీవితాన్ని మార్చేస్తుంది" అంటూ గీతా ప్రేమికులు ప్రచారం చెయ్యాలి.

ఎవ్వరినీ కష్టపెట్టనివాడు, ఎవ్వరి వలనా కష్టం పొందనివాడు సుఖ దుఃఖాలకు, భావోద్వేగాలకు అతీతుడైనవాడు నాకు (పనికి) ప్రియతముడు.

- త్యాగమనేది గొప్పదే! కాని, విషయభ్రాంతిని త్యాగమొనరించుట అన్నింటికంటే గొప్పది. విషయభోగాన్ని త్యాగమొనరించినవాడు ధన్యుడు. మిగతా త్యాగములన్నీ పాక్షిక ఫలితముల నిచ్చునవే. పూర్ణ ఫలితము నిచ్చునది విషయత్యాగ మొక్కటే.

# మహాభారతంలోని నీతి కథలు

.. డాక్టర్ కె. సత్యనారాయణ
సెల్: 9440732210

సృష్టిలో తల్లికంటే గొప్పది మరొకటి లేదంటే అతిశయోక్తి కాదు. అందుకే వేదాల్లో ఆమెకు "మాతృదేవోభవ" అంటూ ప్రథమస్థానాన్ని ఇచ్చారు. తల్లి తర్వాతే తండ్రి అయినా, భగవంతుడైనా అని చెప్పడమే ఆమె ప్రాధాన్యతకు నిదర్శనం. అలాంటి తల్లి ఋణాన్ని తీర్చుకున్న తనయుని కథే మహాభారతంలోని గరుత్మంతుని కథ.

వినత మంచి ప్రవర్తన, భర్తపట్ల, దైవము పట్ల సద్భక్తి కల్గిన ఇల్లాలైనప్పటికీ స్త్రీ సహజమైన అసూయవల్ల, తొందరపాటు తనంవల్ల తన బిడ్డచేతనే శాపగ్రస్థురాలౌతుంది. తన అక్కకే దాసీగా మారి 500 సంవత్సరాలు సపర్యలు చేస్తుంది. ఇలా ఉండగా ఒకరోజు ఆమెకు మంచి రోజులు వచ్చాయనడానికి సూచనగా రెండో అండాన్ని పలగులకొట్టుకుని మహాతేజశ్శాలి అయిన గరుడుడు బైటకు వస్తాడు. అతనిశక్తి, గమనం, తేజస్సు, బలం, రూపాన్ని చూసిన దేవతలు కూడా అతని శరణువేడుకుంటారు. అలాంటి గరుడుని కద్రువ, వినత దాసీతనాన్ని అడ్డుపెట్టుకుని అనేక పనులు పురమాయించి వేధిస్తుంది. విసిగిపోయిన గరుడుడు ఒకనాడు తల్లితో "అమ్మా! నేను ఈ సర్పాల ఆజ్ఞలను ఎందుకు పాటించాలి ?" అని ప్రశ్నిస్తాడు. అప్పుడు తల్లి వినత "నాయానా! ఈ సర్పాల మోసం వల్లనే నేను పందెం ఓడి, నా సవతికి దాసీనయ్యానని" బాధపడ్తుంది. తన మాతృమూర్తికి కల్గిన కష్టం గరుడునికి దుఃఖ కారణమౌతుంది. ఒకరోజు తన వీపుమీద ఉండి విహరిస్తున్న నాగులతో "ఓ నాగులారా! నేను, నా తల్లి ఈ దాస్యం నుండి విముక్తి చెందాలంటే మీకు ఏం చేయాలి ?" అని అడుగుతాడు. అప్పుడు ఆ సర్పాలన్నీ "నువ్వు మాకు అమృతం తెచ్చిపెడితే నిన్ను, నీ తల్లిని దాస్యవిముక్తుల్ని చేస్తామని" అంటాయి.

గరుడుడు తల్లితో "అమ్మా! సర్పాల కోరిక ప్రకారం నేను అమృతం తేవడానికి వెళ్తున్నాను. నన్ను ఆశీర్వదించు" అని ప్రార్థిస్తాడు. అందులకు వినత "నాయనా! సముద్రంలో విషాదుల స్థావరం ఉంది, ఆ విషాదులను పట్టి తిన్నట్లైతే నీకు అమృతం తేగల బలం చేకూరుతుంది" అని చెప్పి ఆశీర్వదించి పంపుతుంది. తల్లి చెప్పిన ప్రకారం మార్గమధ్యంలో విషాదులను తిని తండ్రి అయిన కశ్యప్రజాపతి వద్ద కెళ్ళి విషయం నివేదించి నమస్కరిస్తాడు. అప్పుడు కశ్యపుడు తన కుమారుడి రాకకు సంతోషించి "నాయనా! ఇక్కడికి కొద్ది దూరంలో ఒక సరస్సు ఉంది. దానిలో ఒక ఏనుగు, తాబేలు ఉంటున్నాయి. అవి పూర్వ జన్మలోనూ అన్నదమ్ములైనా ప్రస్తుతం శత్రువులు. పరస్పరం కలహించుకుంటున్నాయి. ఎంతో బలమైన వాటిని తిని నువ్వు శక్తి తెచ్చుకుని అమృతం తీసుకురా!" అని ఆశీర్వదిస్తాడు. తండ్రి ఆనతి ప్రకారం గరుడుడు ఆ సరోవరం చేరి ఆ రెండు జంతువులనూ పట్టుకుని ఎగురుతూ గంధమాధన పర్వతం చేరి అక్కడ ఆరగిస్తాడు. పిదప అత్యంత శక్తితో, వేగంతో అమృతం కోసం బయలుదేరుతాడు. గరుడుడు అమృతం కోసం అమరావతికి వస్తున్నాడని తెలుసుకున్న ఇంద్రుడు తన పరివారాన్ని, సైన్యాన్ని అప్రమత్తం చేస్తాడు. కానీ గరుడుని శక్తి ముందు దేవతల శక్తి కొరగానిది అవుతుంది. గరుడు ముక్కుపోటులకు వాళ్ళ శరీరాలు చిట్లిపోతాయి. అలా దేవతలను ఓడించి ఆ తర్వాత అమృతం చుట్టూ ఉన్న అగ్నిజ్వాలలను అనేక నదులలోని నీల్లు తెచ్చి ఆర్పివేస్తాడు. పిదప సూక్ష్మ శరీరుడై ముందుకు సాగిపోతాడు. లోహ చక్రాన్ని దాటి అమృతాన్ని రక్షిస్తున్న భయంకర సర్పాలను చంపి అమృతాన్ని తీసుకుని నాగులకిచ్చి తన తల్లిని దాస్య విముక్తురాలిని చేస్తాడు.

ఇలా గరుడుని మాతృసేవానురక్తి సమస్త దేవతల ప్రశంసలకు పాత్రమైంది.

# రఘువంశం



మహాకవి కాళిదాసు కృతికి భావానువాదం:
డా॥ సముద్రాల లక్ష్మణయ్య, తిరుపతి

(గత సంచిక తరువాయి)

**ఇందుమతి పెండ్లి**

అన్ని విధాలా తనకు తగిన వరుడు లభించడంవల్ల ఇందుమతి కుమారస్వామితో కూడిన దేవసేన లాగా శోభిల్లింది. ఆ వధూవరులను వెంటబెట్టుకొని భోజమహారాజు నగర ప్రవేశం చేయటానికి ఉద్యుక్తుడయ్యాడు.

ఆ భోజమహారాజుయొక్క చెల్లెలిపట్ల నిరాశులైన నరాధిపులు తమ రూపాన్నీ, వేషాన్నీ నిందించుకున్నారు. ప్రాతఃకాలంలోని గ్రహాలలాగా వెలవెలపోయిన ఆ రాజులందరూ తమతమ శిబిరాలకు తరలిపోయారు. అజునిపట్ల వారందరికీ మాత్సర్యం పెల్లుబికింది. అయినా సన్నిధిలో ఇంద్రాణి వుండడంవల్ల వాళ్లు స్వయంవరానికి విఘ్నం కలిగించలేకపోయారు. (శచీదేవి చెంత అంతరాయం కలిగించేవారు వినాశానికి గురి అవుతారని శాస్త్రం. అందుకే వివాహంలో శచిని పూజించాలని పెద్దల నిర్ణయం.)

వధూసమేతుడైన అజమహారాజు రాజమార్గం ప్రవేశించాడు. మార్గమంతా పూలతోనూ, చిగురుటాకులతోనూ అలంకృతమయింది అందలి తోరణాలు ఇంద్రధనుస్సుల్లాగా వివిధ కాంతులతో విరాజిల్లాయి. దట్టమైన పతాకాల నీడలు సోకి దారి చల్లబడింది.

బంగారు కిటికీల మేడలలోని సుందరీమణులు అన్ని పనులూ మానుకొని అజమహారాజును దర్శించాలని ఉబలాటపడ్డారు. రాజదర్శనానికై ఒకతె పరుగిడుతూ వచ్చింది. ఆ తొందరలో ఆమె కొప్పు కాస్తా సడలి పూలు జారిపొయ్యాయి. వీడిన కొప్పు చేతపుచ్చుకొని అలాగే వచ్చింది. కాని దాన్ని ముడివేసుకోవాలన్న భావం ఆమెకు కలగనేలేదు. లత్తుక అద్దుతున్న చెలికత్తెనుండి తటాలున తన కాలు లాక్కొని అడుగుమోపిన చోట గుర్తులేర్పడుతూ వుండగా మరొకతె జాలకం చెంతకు చెకచెకా నడిచింది. ఇంకొకతె కుడికంటికి కాటుక పెట్టుకొని ఎడమకంటికి పెట్టుకోకుండానే కాటుకపుల్ల చేతబట్టి అలాగే కిటికీ చెంతకు పరుగుతీసింది. వేరొకతె తొందరనడకవల్ల జారిపోయిన పోకముడి బిగించకనే కరకంకణ కాంతులు బొడ్డును క్రమ్ముకోగా చీర చేతబట్టి గవాక్షం నుంచి వెలుపలికి చూస్తూ నిలిచిపోయింది. ఒకానొకతె సగం మాత్రమే మణులు గ్రుచ్చిన మొలనూలు కేలనుంచుకొని చివాలున సౌధవాతాయనం వద్దకు నడిచింది. అంతవరకూ గ్రుచ్చిన మణులన్నీ అడుగడుగునా జారిపోగా చివరి కామె చేత దారం మాత్రమే మిగిలింది.

రాజసందర్శనానికై ఎంతో ఉబలాట పడుతున్న ఆ కోమలాంగులు భవనవాతాయనాల వద్ద నిలబడి అదేపనిగా చూడసాగారు. ఆసవ గంధంతోనూ, కదలే కన్నులనే తుమ్మెదలతోనూ కూడిన ఆ వనితల వదనాలు గవాక్షాల నలంకరించే కమలాల లాగా కనిపించాయి. రాజకుమారుణ్ణి నిలువెల్లా కనులై తదేక దృష్టితో చూస్తున్న ఆ సుదతీ లలామలు ఇతర విషయాలను పూర్తిగా విస్మరించారు. తక్కిన ఇంద్రియ వ్యాపారాలన్నీ అప్పుడు వారి చక్షురింద్రియాన్నే

ప్రవేశించినట్లయింది.

"పరోక్షంగా ఎందరో రాకుమారులు ఇందుమతిని అర్థించారు. అయినా ఆమె స్వయంవరమే మేలని భావించింది. అది యుక్తమే. అలా కాకపోతే రమాదేవి మాధవుని పొందినట్లు ఆమె తన కనురూపుడైన పతినెలా పొందగలిగేది ? బ్రహ్మదేవుడు అందాలరాశియైన ఈ జంటనిలా కూర్చి ఉండకపోతే అతని ఈ సౌందర్య సృష్టిప్రయాస వ్యర్థమై వుండేది. రతిమన్మథులే ఇలా దంపతులై అవతరించారు. ఇందులో సందేహం లేదు. వేలకొలది రాజపుత్రులలో ఈ చిన్నది తనతో సమానుడైన ఇతణ్ణే వరించింది. మనస్సు జన్మాంతర సంగతిని గ్రహిస్తుంది కదా!"

ఇలా పౌరకాంతలు వీనుల కింపుగా మాట్లాడుకోవడం వింటూ రాజకుమారుడు మంగళ సంపన్నమై శోభిల్లుతున్న భోజమహీపతి గృహం చేరుకున్నాడు. ఏనుగు పైనుండి దిగి కామరూప భూపాలుడు తనచేయి పట్టుకొని నడిపిస్తుండగా భోజుడు చూపిన విడిదిలో చెలువల చిత్తాలలోకి ప్రవేశించినట్లు అజుడు ప్రవేశించాడు. అక్కడ మహోన్నతమైన సింహాసనం అధిష్ఠించాడు. భోజవిభుడు రత్నాలతోనూ, మధుపర్కంతోనూ కూడిన అర్ఘ్యమూ, పట్టువస్త్రాలూ సమర్పించి అతణ్ణి పూజించాడు. ఆ భూపాలుడిచ్చిన గౌరవాన్ని కాంతాకటాక్షాలతో సహా అజుడు పరిగ్రహించాడు.

నురుగులు గ్రక్కుతున్న సాగరుణ్ణి చంద్రమయూఖాలు తీరభూమిచెంతకు తీసుకపోయినట్లు అంతఃపురాధికారులు దుకూల వస్త్రధారియైన అజుణ్ణి వధువు పొంతకు కొనిపోయారు. అక్కడ అగ్నితుల్యుడైన భోజుని పురోహితుడు నేయి మొదలైన ద్రవ్యాలతో హోమం పూర్తిచేసి అగ్నిసాక్షికంగా ఆ వధూవరు లిరువురినీ కలిపాడు. వరుడు, వధువు హస్తాన్ని తన హస్తంతో పరిగ్రహించి అశోక లతాపల్లవాన్ని తన పల్లవంతో స్పృశించిన గున్నమామిడి చెట్టులాగా భాసించాడు. అతని ముంజేయి గుగుర్పాటు చెందింది. ఆమె వ్రేళ్లు చెమటతో చెమ్మగిల్లాయి. అప్పుడు మన్మథుడు వధూవరు లిరువురిలోనూ అనురాగస్థితిని సమంగా విభజించాడా అన్నట్లు గోచరించింది.

పరస్పర సందర్శనాభిలాషతో వధూవరులు కడగంటి చూపులను ప్రసరింపజేశారు. ఇరువురి చూపులూ కలిసిపోగానే సిగ్గు అడ్డుదగిలి వాటిని వెనక్కు మళ్ళించింది. ఉజ్జ్వలమైన అగ్నికి ప్రదక్షిణంగా నడుస్తున్నప్పుడు ఆ దంపతులు మేరుపర్వతం చుట్టూ జంటగా పరిభ్రమించే రేపవళ్ళలాగా ప్రకాశించారు. విపులమైన పిరుదులూ, మత్తచకోరాల వంటి నేత్రాలూ కల ఆ లజ్జావతి ఇందుమతి బ్రహ్మతుల్యుడైన గురుని ప్రేరణతో హోమాగ్నియందు లాజలను విసర్జించింది. హవిస్సు, జమ్మిచివుళ్లు, లాజలు వీటి గంధంతో నిండి పవిత్రమైన హోమధూమం పైకెగసింది. అది ఇందుమతి చెక్కిళ్ళపై ప్రసరించి నపుడు క్షణకాలం ఆమెకు కర్ణోత్పలమై విలసిల్లింది. ఆ హోమధూమం క్రమ్ముకోవడం వల్ల ఆమె కాటుకకళ్ళు చెమ్మగిల్లాయి. కర్ణపూరమైన యవాంకురం వాడబారింది. కపోలాలు ఎరుపెక్కాయి. స్నాతకులూ, బంధుసమేతుడైన భోజరాజూ, సుమంగళులైన పురస్త్రీలూ వరుసగా బంగారు పీటలమీద కూర్చున్న ఆ వధూవరులపై ఆర్ద్రాక్షతలు చల్లారు.

ఈ రీతిగా భోజమహారాజు చెల్లెలి పెళ్ళిపూర్తిచేశాడు ఆపైన రాజులందరినీ వేర్వేరుగా సత్కరించవలసిందని అధికారుల నాదేశించాడు. కానుకల నెపంతో భోజుడు

కావించిన సత్కారాలకు బదులు సమర్పించుకుని తెచ్చుకోలు సంతసంతో తమ మానసిక వికారాన్ని కప్పిపుచ్చుకొని లోపల మొసళ్ళతో నిండిపైకి నిర్మలంగా కనిపించే మడుగుల్లాగా వున్న ఆ నరపతులు ఆయనతో వెళ్ళివస్తామని చెప్పి కదిలారు. ఆ రాజులందరూ ఎలాగయినా సమయం చూచి, ఇందుమతిని హరించాలని ముందుగానే సంకేతం చేసుకొన్నారు. అందుల కనుగుణంగా అజుడు తిరిగిపోవలసిన మార్గానికి అడ్డంగా నిలబడ్డారు.

భోజరాజు చెల్లెలిపెళ్లి పూర్తిచేసి ఆమెకు తగిన అరణం సమర్పించాడు. వధూసమేతంగా అల్లుణ్ణి సాగనంపుతూ తానూ అతనివెంట నడిచాడు. అలా మార్గంలో మూడు రాత్రులు లోకవిఖ్యాతుడైన అజునితో ఉండి పున్నమి పోగానే చంద్రుడు సూర్యుణ్ణి వదలినట్లు అతణ్ణి వదలి కుండిన నగరానికి మరలాడు.

దిగ్విజయకాలంలో మన సంపదలు కొల్లగొట్టాడన్న కారణంగా రాజులంతా ముందే రఘుమహారాజు మీద మిక్కిలి కినుక వహించి ఉండినారు. అందువల్లనే అతని కుమారుడు స్త్రీరత్నాన్ని చేజిక్కించుకోవడం వాళ్లు సహించలేకపోయారు. పూర్వం బలిచక్రవర్తి సమర్పించిన సిరిని స్వీకరిస్తున్న త్రివిక్రముని పాదాన్ని ప్రహ్లాదుడు నిరోధించి నటుల ఇందుమతిని గైకొని వెళుతున్న అజుణ్ణి ఆ రాజవర్గం నిరోధించింది. అప్పుడు రాకుమారుడు వధూరక్షణకై పెక్కుమంది భటులతో కూడిన ఆప్తసచివుణ్ణి నియోగించాడు. గంగా ప్రవాహాన్ని ఎగసిపడే అలలుగల శోణనదం ఎదుర్కొన్నట్లు ఆ రాజుల సేనను తాను ఎదుర్కొన్నాడు.

ఇంతలో ఇరు సైన్యాలలోనూ కాలిబంటు కాలిబంటుతోనూ, రథికుడు రథికుడితోనూ, రౌతు రౌతుతోనూ, గజస్థుడు గజస్థుడితోనూ తలపడినారు. ఇలా సమస్కందులతో ప్రారంభమయిన పోరు ఘోరంగా కొనసాగింది. తూర్యాల రవళిలో ఒకరిమాట ఒకరికి వినిపించలేదు. అందుచేత సైనికుల తమ కులనామాలను పేర్కొనకుండా సంకుల సమరం సాగించారు. అయినా, ఆ విలుకాండ్రు పరస్పరం ప్రయోగించుకున్న బాణాలమీది నామాక్షరాలే వారివారి పేరు ప్రఖ్యాతలు చాటినాయి.

గుఱ్ఱపు గిట్టల తాకిడికి పైకెగసిన ధూళి రథచక్రాల సంచలనంతో మరీ దట్టమయింది. ఏనుగు చెవుల గాలికి అది మరీ విస్తరించి వస్త్రంలాగా సూర్యుణ్ణి కప్పివేసింది. ఆ సేనాపరాగాన్ని గాలికి విచ్చుకున్న నోళ్ళతో గ్రహిస్తున్న మత్స్యధ్వజాలు కలుషిత జలాలను త్రాగే అచ్చమైన చేపల్లాగా భాసిల్లినాయి. దుమ్ముదట్టంగా క్రమ్ముకోవడంవల్ల కంటికి ఏమీ కనిపించలేదు. అప్పుడు చక్రాల సవ్వడితో రథాలనూ, ఘంటానినాదాలతో కరులనూ అలాగే స్వామి నామోచ్చారణను బట్టి తమవారినీ, పరవారినీ సైనికులు గుర్తించి కయ్యంకొనసాగించగలిగారు.

అలా యుద్ధభూమిలో కంటిచూపును నిరోధిస్తూ పరాగమనే చీకటి విజృంభించింది. ఆపైన శస్త్రాల దెబ్బలకు గురైన గుఱ్ఱాలు, ఏనుగులు, సైనికులనుంచి ప్రవహించిన రక్తం ఆ చీకటి పాలిటికి బాలభానుడయింది. నెత్తురు పారడంవల్ల నేలతో సంబంధం గోల్పోయిన ధూళి గాలికి పైకెగిరింది. అప్పుడది నిప్పు కణికలు మాత్రమే నిలిచి అంతకు మునుపే పైకెగసిన పొగలాగా భాసించింది.

దెబ్బతిని మూర్ఛిల్లిన రథికులు మూర్ఛనుండి తేరుకోగానే రథాలను శత్రువుల బారినుండి తొలగించిన సారథులను అధిక్షేపించారు. పిమ్మట తొల్లిటి ధ్వజ చిహ్నాలతో గుర్తించి తమ్ముకొట్టిన వారిమీదనే మళ్లీ శరప్రయోగం చేశారు. నిపుణులైన

విలుకాండ్రు ప్రయోగించిన బాణాలు మార్గమధ్యంలో శత్రుబాణాలకు తగిలి నడిమికి విరిగిపోయాయి. అయినా, వాటి పూర్వభాగాలు మాత్రం వేగాతిశయంతో ముందుకు దూసుకుపోయి లక్ష్యాలను ఛేదించాయి.

గజయుద్ధంలో తీక్ష్ణ చక్రప్రయోగంతో ఖండింపబడ్డ గజారోహకుల శిరస్సులు డేగల గోళ్ళలో తలవెండ్రుకలు తగులు కోవడంవల్ల చాలాసేపటికిగాని నేలబడలేదు. దెబ్బతిని మూర్ఛిల్లి గుఱ్ఱం మూపుపై ఒరిగిన శత్రువుమీద అతడు తేరుకుని తిరిగి తనతో తలపడే వరకూ మొదటివాడు శస్త్రప్రయోగం చేయనేలేదు. కవచధారులైన సైనికులు శరీరాలపై మమకారం వదలి ఒరనుండి పెరికిన ఖడ్గాలతో గజాల పెనుదంతాలపై తీవ్రంగా ప్రహరించారు. ఆ దెబ్బకు భయపడ్డ ఏనుగులు తొండాలనుంచి చిమ్మిన నీటి తుంపరలు ఆ సంఘర్షణవల్ల జనించిన అగ్నిని ఆర్పివేశాయి.

శరాలతో ఛేధింపబడి నేలవ్రాలిన శిరస్సులనే ఫలాలతోనూ, శిరస్త్రాణాలనే పానపాత్రలతోనూ, నెత్తురనే మధ్యప్రవాహంతోనూ నిండిన కదనభూమి మృత్యుదేవత యొక్క పానభూమిలా ప్రకాశించింది. పక్షులు ఇరువైపుల పీక్కుతింటున్న ఒక భుజఖండాన్ని నక్క బలవంతంగా లాక్కున్నది. కాని బాహుపురుల కొనలు తగిలి దవడలు గాయమయ్యే సరికి మాంసం మీద ప్రీతి ఉన్నప్పటికీ అది దాన్ని వదిలేసింది. శత్రు ఖడ్గప్రహారాలతో తలతెగిన ఒక వీరుడు వెంటనే సురలోకంలో విమాన ప్రభువు అయ్యాడు. అక్కడ ఎడమ తొడపై సురాంగనను కూచోబెట్టుకొని విహరిస్తూ రణరంగంలోనృత్యం సల్పుతున్న తన మొండెమును చూచాడు.

ఇరువురు రథికులు ఒండొరులతో తలపడినారు. సారథులు నిహతులు కాగా, తామే రథాలు నడుపుకుంటూ సమరం సాగించారు. గుఱ్ఱాలు కూడా చచ్చేసరికి గదాయుద్ధానికి ఉపక్రమించారు. గదలు సైతం విరిగిపోయాయి. ఆపై బాహుయుద్ధానికి ఉద్యమించారు. ఇరువురు భటులు ఒకరితో నొకరు తీవ్రంగా పోరాడి ఒకే క్షణంలో అసువులు వీడి దేవత్వాన్ని పొందినారు. దేవలోకంలోకూడా ఒకే అప్సరసను అభిలషించిన వారిరువురికీ వివాదం తప్పలేదు. ఈ విధంగా ఇరుపక్షాల సేనలు క్రమంగా వెనుకకూ, ముందుకూ వీచే గాడ్పులకు చెలరేగిన రెండు మహాసముద్రపుటలల చందంగా అవ్యవస్థతమైన జయాపజయాలు పొందినాయి.

చివరకు శత్రుబలాలతాకిడికి అజుడి సైన్యం చెల్లాచెదరైపోయింది. అయినా మహాపరాక్రమశాలి అయిన ఆ రాజపుత్రుడు తానొక్కడే రిపుసైన్యాన్ని ఎదుర్కొన్నాడు. గాలికి పొగ వెనక్కు మళ్లినా అగ్నిమాత్రం గడ్డికుప్పవైపే ప్రసరిస్తుంది కదా! కవచాన్నీ, ధనుర్బాణాలనూ ధరించి రథస్థుడైన ఆ అసహాయశూరుడు రణగర్వితుడై ముందు కురికాడు. కల్పాంతంలో ఆదివరాహం ఉద్వేలమైన సముద్రజలాన్ని కలచి వేసినట్లు రాజవర్గాన్ని కలచివేశాడు. సంగ్రామరంగంలో అతడు కుడిచేతిని గానీ, ఎడమచేతినిగానీ అమ్ములపొదిలో ప్రవేశింపజేసిన దృశ్యం కనిపించనేలేదు. ఆ మహాయోధుడు ఒక్కసారి ఆ కర్ణాంతంలాగిన అల్లెత్రాడు శత్రువులను నురుమాడే శరపరంపరను తనకు తానే సృష్టించిందా అన్నట్లు గోచరించింది.

అజుని శరప్రహారంతో కంఠాలనుండి తెగిపడ్డ శత్రుశిరస్సులు రోషంతో కొఱకడంవల్ల మిక్కిలిగా ఎఱ్ఱవారిన పెదవులతోనూ, స్పష్టంగా కనిపించే ఊర్ధ్వరేఖలు గల బొమముడులతోనూ, హుంకారాలతోనూ ఒప్పారి రణక్షోణినంతా

కప్పివేశాయి. అప్పుడాశత్రువు లందరూ కూడుకొని రథగజతురగాది సకల సేనాంగాలతోనూ, కవచాలను చీల్చివేసే సమస్తాయుధాలతోనూ, సర్వప్రయత్నాల తోనూ, ఒక్కుమ్మడిగా అజుణ్ణి ప్రహరించటానికి పూనుకొన్నారు. విరోధులు ప్రయోగించిన బాణాలు అజుని అరదాన్ని కప్పివేశాయి. అంతటా మంచు క్రమ్ముకొన్నప్పుడు కొద్దిపాటి వెలుగులు విరజిమ్మే ప్రభాకరునివల్ల ప్రాతఃకాలాన్ని గుర్తించినట్లు కేవలం ధ్వజాగ్రాన్నిబట్టి అజుడి ఉనికి గుర్తింపబడింది.

అప్పుడు మారసుందరుడూ, మహాజాగరూకుడూ అయిన అజమహారాజు ప్రియంవదు డిచ్చిన ప్రస్వాపన మనే గాంధర్వాస్త్రాన్ని పగతురపై ప్రయోగించాడు. ఆ అస్త్ర ప్రభావంవల్లవాళ్ళ హస్తాలు ధనురాకర్షణ చేయజాలక స్తంభించిపోయాయి. శిరస్త్రాణాలు ఒకప్రక్క, భుజంవైపుగా ఒరిగిపోయాయి. దేహాలు ధ్వజస్తంభాలకు చేరగిలబడ్డాయి. అలా శాత్రవ సైన్యమంతా గాఢనిద్రలో మునిగిపోయింది.

పిమ్మట అజుడు తన విజయం సూచిస్తూ శంఖం పూరించాడు. ఇందుమతి చవిచూచిన అతని క్రింది పెదవివద్ద నిల్పిన ఆ శంఖాన్ని ఆవలోకించినప్పుడు ఆ మహావీరుడు స్వహస్తాలతో ఆర్జించిన మూర్తిమంతమైన కీర్తిని పానం చేస్తున్నాడా అనిపించింది. భండనభూమినుండి పరుగిడిపోయిన అతని సైనికులు శంఖారావం గుర్తించి తిరిగివచ్చారు. ముకుళించుకొన్న పద్మాల నడుమ భాసిల్లే ప్రతిబింబ చంద్రునిలాగా నిద్రించే శత్రువులమధ్య వున్న తమ ప్రభువును వారు తిలకించారు.

"ఇప్పుడు రాఘవుడు మీకీర్తినే హరించాడు గాని కృపతో మీ జీవితాన్ని హరించలేదు" అన్న వాక్యాన్ని అజుడు రక్తసిక్తమైన బాణాగ్రాలతో ఆ నరపతుల ధ్వజాలపై వ్రాయించాడు. పిదప శిరస్త్రాణం తొలగించడంవల్ల సడలిన కేశబంధంతోనూ, నుదుట గ్రమ్మిన చెమట బొట్లతోనూ చెలువారుతూ ఆ రాకుమారుడు భీతిల్లిన ఇందుమతి చంతకు జేరి వింటికొప్పున ఒక చేయి నిల్పి ఇలా అన్నాడు.

"వైదర్భీ! ఇదుగో అనుమతి నిస్తున్నాను. ఈ వైరి నరపతులను చూడు. ఇప్పుడు వీరి నుంచి అర్భకులు సైతం ఆయుధాలను లాగివేయవచ్చు. ఈ పాటి యుద్ధచేష్టతో వీరు నా చేతనుండి నిన్ను అపహరించుకుపోవాలని ఆశించారు."

ప్రత్యర్థుల భయంవల్ల కల్గిన విషాదం వీడిపోగానే ఆమె నెమ్మోము నిట్టూర్పుల ఆవిరి తొలగి సహజ నైర్మల్యం సంతరించుకొన్న అద్దంలాగా అలరారింది. ఆమె ప్రియుని పౌరుషానికి ఎంతో సంతోషించింది. అయినా సిగ్గువల్ల తనకు తానే పతిని అభినందించలేకపోయింది. తొలకరి చినుకులకు తడిసిన నేల నెమలికేకలతో మేఘబృందాన్ని అభినందించినట్లు ఆమె చెలికత్తెల పలుకులతో ప్రాణప్రియుడికి అభినందన లందించింది.

ఇలా నిర్దోషుడైన అజనృపాలుడు రాజుల శిరస్సుపై ఎడమ పాదముంచి అనవద్య చరిత్ర అయిన ఇందుమతిని పరిగ్రహించాడు. రథాశ్వాలు రేపిన ధరాధూళితో ముంగురులు బిరుసెక్కిన ఆ వధూమణి మూర్తీ భవించిన సమర విజయలక్ష్మి అయింది.

అజుడు రాకముందే రఘుమహారాజు కుమారుని విజయవార్త విన్నాడు. తగిన పత్నితో కూడి పురానికి తిరిగివచ్చిన పుత్రుణ్ణి అభినందించాడు. సంసారభారాన్ని అతని కప్పగించాడు. శాంతిమార్గంలో ఔత్సుక్యం వహించాడు. అది యుక్తమే. కులధురంధరుడు ఉండగా రవివంశజులైన రాజులు, గృహస్థాశ్రమంలో కొనసాగరు కదా!

........

# హయవదనుడు

....గోనుగుంట మురళీకృష్ణ, 9701260448

అది వైకుంఠపురము. ద్వారం దగ్గర జయవిజయులు నిలబడి ఉన్నారు. ఇంద్రుడు, వరుణుడు, యముడు మొదలైన దిక్పాలకులు మిగిలిన దేవతలతో కలసి అక్కడికి వచ్చారు.

"జయ విజయులారా! లోక కల్యాణార్థం మేమొక యజ్ఞం చేయతలపెట్టాము. అందుకు విష్ణువును ఆహ్వానించడానికి వచ్చాము. దారి వదలండి" అన్నాడు దేవేంద్రుడు.

"క్షమించు దేవేంద్రా! స్వామి వారు వైకుంఠంలో లేరు. రాక్షస సంహారం కోసం భూలోకం వెళ్లారు." అన్నాడు జయుడు.

"రాక్షస సంహారం ఎన్నడో జరిగిపోయింది కదా! ఇంకనూ రాలేదా!" ఆశ్చర్యంగా అన్నాడు దేవేంద్రుడు. ఒక్కక్షణం కళ్ళు మూసుకుని ధ్యానించాడు. కళ్ళు తెరిచి "శ్రీమహావిష్ణువు ఉన్న తావు నాకు తెలిసింది. రాక్షసులతో యుద్ధంచేసి అలసి, సొలసి నిద్రిస్తున్నారు. మనం అక్కడికి వెళదాం రండి" అన్నాడు సహచరులతో.

అందరూ భూలోకం వచ్చారు. అక్కడ విష్ణువు ఒక కొండరాయి మీద కుర్చుని వింటి కొసకు తలను చేర్చి నిద్రిస్తూ కనిపించాడు. ఆయనను నిద్రలేపడం ఎలాగో దేవతలకు తోచలేదు. కొంతసేపు తర్జన భర్జనల తర్వాత బ్రహ్మదేవుని ప్రార్థించారు.

బ్రహ్మ ప్రత్యక్షమయ్యాడు. దేవేంద్రుడు తాము వచ్చిన విశేషం, తమకు కలిగిన ఇబ్బంది గురించి చెప్పారు. బ్రహ్మదేవుడు ఒక పురుగును సృష్టించాడు. "నీవు వెళ్ళి ఆ వింటినారిని కొరుకు. విష్ణువు నిద్రలేస్తాడు" అని చెప్పాడు.

"స్వామీ! తల్లీ బిడ్డలను విడదీయటం, నిద్రాభంగం చేయటం, భార్యాభర్తలకు ఎడబాటు కలిగించటం, పుణ్యకథలకు విఘ్నం కలిగించడం మహాపాపం అని పెద్దలు అంటారు కదా! నన్ను ఇటువంటి పని చేయడానికి వినియోగించటం భావ్యమేనా!" అన్నది పురుగు.

"ఇది దేవకార్యం. నీకు పాపం రాకుండా నేను వరమిస్తున్నాను. వెళ్ళు" అన్నాడు బ్రహ్మ. "ఆజ్ఞ" అని పురుగు వెళ్ళి వింటినారిని కొరికింది. వెంటనే భయంకరమైన శబ్దం చేస్తూ వింటికొన వేగంగా లేచి విష్ణువు శిరసు ఖండించింది. తల ఎక్కడికో రివ్వున ఎగిరిపోయింది.

దేవతలంతా నివ్వెరపోయారు. ఏం ప్రమాదం జరగనున్నదో అని భయంతో వణికిపోయారు. ఇంద్రుడు బృహస్పతిని చూసి "గురుదేవా! మనం తలచింది ఒకటి, జరిగినది వేరొకటి. సాక్షాత్ శ్రీమహావిష్ణువు తలేఎగిరిపోయిందంటే మనకు మించిన శక్తి ఏదో ఉంది. ఇప్పుడు మన కర్తవ్యం ఏమిటి ? అన్నాడు. ఆందోళనగా ఔను మహేంద్రా! నువ్వన్నది నిజం. మనకు మించిన శక్తి ఉన్నది. ఆ శక్తే జగన్మాత. ఆమెను ప్రార్థించండి. మీ కర్తవ్యం బోధపడుతుంది" అన్నాడు బృహస్పతి.

ఇంద్ర, వరుణ ఆదిగాగల దేవతలందరూ కన్నులు మోడ్చి నమస్కరించారు. "జగజ్జననీ! ఆదిపరాశక్తీ!

సర్వభూతాలకూ ఆధారమైన మూల ప్రకృతివి. సృష్టి, స్థితి, లయ కారిణివి, నీ సంకల్పం లేక గడ్డిపోచయినా కదలలేదుకదా! ఈ మహానుభావుడి శిరసు ఏమైందో తెలియదు. బ్రతికించటానికి మాకు ఏ ఉపాయమూ తోచలేదు. నీవే శరణు! నీవు తప్ప మాకు దిక్కులేదు. కరుణించు" అని పరిపరి విధాల ప్రార్థించారు.

వెనువెంటనే కళ్ళు మిరుమిట్లు గొలుపుతూ ఒక మెరుపు మెరిసింది సింహవాహనం మీద ఆ సీనురాలయి జగన్మాత ప్రత్యక్షమైంది. ఆమె పద్దెనిమిది. చేతులతోనూ శంఖము, చక్రము, దండము, ఖడ్గము మొదలైన ఆయుధాలు ధరించి వుంది.

"దేవతలారా! మీ భక్తికి సంతోషించాను. విష్ణువు శిరశ్ఛేదం జరగటానికి కారణం చెపుతాను వినండి. ఒకనాడు విష్ణువు ఉద్యానవనంలో లక్ష్మితో విహరిస్తూ అనుకోకుండా నవ్వాడు. అది చూసి లక్ష్మికి కోపం వచ్చింది. "నా ముఖం అంత వికారంగా ఉందా ? నాకన్నా అందగత్తెను చూసి నన్ను హేళన చేస్తున్నాడా!' అనుకుని 'నీ శిరసు తెగి సముద్రంలో పడుగాక' అని శపించింది. ఆ శాపకారణంగానే ఈతని తల తెగిపోయింది.

ఒకప్పుడు హయగ్రీవుడు అనే రాక్షసుడు నా గురించి తపస్సు చేశాడు. నేను ప్రత్యక్షంకాగా చావు లేకుండా వరం ఇమ్మని అడిగాడు. 'పుట్టిన ప్రతి ప్రాణీ గిట్టక తప్పదు. మరేదయినా వరం కోరుకో' అన్నాను. 'అయితే నా లాంటి హయగ్రీవుని (గుర్రం శిరసు గలవాడు) చేత తప్ప ఇంకెవరిచేతా మరణం లేకుండా వరం ప్రసాదించు' అన్నాడు. అలాగేనని అన్నాను. కనుక మీరు ఈ విష్ణువుకు గుర్రం తల తెచ్చి కూర్చండి. ఇతడు హయగ్రీవుడై జీవిస్తాడు. ఇతని వల్ల ఆ రాక్షసుడు మరణిస్తాడు" అని చెప్పి దేవి అదృశ్యమైంది.

ఇంద్రడు దేవశిల్పి మయబ్రహ్మను పిలిచాడు. మయుడు ఒక గుర్రం తలను తెచ్చి విష్ణువు మొండానికి సంధానం చేశాడు. వెంటనే శిష్ణువు నిద్రలో నుంచీ మేల్కొన్నట్లు లేచి కుర్చున్నాడు. దేవతలంతా హర్షధ్వనాలు చేశారు.

"దేవతలారా! ఇప్పటి నుంచీ మీరు నన్ను హయగ్రీవుడుగా ఎంచి పూజింతురుగాక! నేను ఇప్పుడే వెళ్లి ఆ రక్కసుడిని వధించి వస్తాను. అనంతరం తిరిగి వచ్చి మీరు చేసే యజ్ఞం నిర్విఘ్నంగా జరిగేటట్లు చూస్తాను. వెళ్ళండి" అన్నాడు.

"ధన్యులం ప్రభూ!" అంటూ అందరూ విష్ణువుకు నమస్కరించి వెనుదిరిగారు.

మూలం : దేవీ భాగవతం (రచన నా స్వంతం)

- కష్టకాలంలో మనిషికి గతమే పెట్టుబడి.
- కార్యసాధనకు మూడు సాధనాలు సక్రమమైన మార్గంలో ఉండాలి. అవి 1. విశ్వాసం, 2. నమ్రత, 3.నడవడి.
- ఒంట్లో బలం, కంటిలోచూపు, చేతిలో చేవ వున్నప్పుడు వాటన్నింటిని తన అదుపులో వుంచుకొని నియమబద్ధ జీవితాన్ని ఆచరించేవాడు మహనీయుడే.
- తెలియడమంటే, మాటలాడుట కాదు. మాటలున్నంత వరకు తెలియ వలసింది వున్నట్లే. మాటలాగిపోవుటయే జ్ఞానానికి గుఱుతు.
- వాంఛలు లేనివాడు మనిషి కాడు. వాటిని జయించలేనివాడు మహనీయుడూ కాడు.

# కర్తవ్యాన్ని మరచిపోరాదు

..... బ్రహ్మశ్రీ బొడ్డుపల్లి పవన్‌కుమార్ అవధాని

ఎంతటివారయినా కర్తవ్యాన్ని మరచిపోరాదు. ఎవరైనా తన కర్తవ్యాన్ని నిర్వర్తించిన తరువాతే ఏదయినా చెయ్యాలి. భర్త భార్యపట్ల తన కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. ఆ విషయం మానవుడు అయినా సరే లేదా భగవంతుడు అయినా సరే! కోర్కె పూర్తిచేయడానికి పూనుకున్నాడు. అదేమిటో తెలుసుకుందాం.

రుక్మిణీదేవి మొదలగు రాణులకు ప్రద్యుమ్నుడు మొదలగువారు జన్మించారు. కాని జాంబవతికి సంతానం కలుగలేదు. ఆమె యొక్క దీన వదనాన్ని చూచి శ్రీకృష్ణ పరమాత్మ ఆరు మాసాల కాలం ఉగ్రతపమాచరించాడు. శివభక్తుడైన ఉపమన్యుడు అనే మహామునిని ఆశ్రయించి ఆయన వద్ద నుంచి 'పాశుపత దీక్ష'' ను స్వీకరించాడు. శ్రీకృష్ణ పరంధాముడు మునివేషధారియై మొదట నెల రోజులు శివమంత్రాన్ని జపిస్తూ కేవలం ఫలాన్ని మాత్రమే ఆరగించాడు. రెండవ నెలలో నీటిని మాత్రమే ఆహారంగా తీసుకుంటూ తపస్సు చేశాడు. మూడవ నెలలో కేవలం గాలిని మాత్రమే గ్రహిస్తూ కాలి బొటన వ్రేలిమీద నిలబడి శివమంత్రం జపించాడు. తరువాత పంచాగ్నుల మధ్య నిలబడి తపస్సు చేస్తూ వుండగా చివరకు శివానుగ్రహం కలిగి ఉమానవేతుడై వుండగా పరమశివుడు సాక్షాత్కరించాడు. కామాపురంలో నన్ను దర్శించిన భక్తునికి కామశేషం (కోరిక మిగులు) వుండటానికి వీలులేదు. పరమ శివునితో సర్వప్రాణి కోటికి ఆర్తిని తీర్చేవాడా! విశ్వకారకా! నేను సంసారంలో బందీనయ్యాను. రక్షణకోరి నిన్ను శరణు వేడుకుంటున్నాను. మానవజన్మ ఎత్తి ఎంతగానో భవభీతుడనయ్యాను. నీవే శరణు! శరణు! శరణు!

సంసారం దుఃఖసాగరం తెలిసి ఇదే చేస్తున్నాను. స్త్రీ వశుడినై పారతంత్ర్యాన్ని అనుభవిస్తున్నాను. తపస్సుకి కూడా సంసారమే కారణం. రుక్మిణికి ప్రద్యుమ్నుడు జన్మించాడని జాంబవతి తనకు పుత్రుడు కావాలంటూ నన్ను ఈ తపస్సుకు ప్రేరేపించింది. నీవంటి కుమారుడి ప్రసాదించమని కోరాడు వాసుదేవుడు. ముక్కంటి అనునయంగా బదులు పలికాడు.

చక్రధారి త్రిశూల ధారితో కైలాసానికి వెడలి కొంత కాలం తర్వాత తిరిగి ద్వారకకు వచ్చాడు. మార్గమధ్యంలో శ్రీకృష్ణుడు సంతృప్తి చెంది ఉపమన్యుడికి కృతజ్ఞతా పూర్వకంగా నమస్కరించాడు. కొంత కాలం తర్వాత జాంబవతికి "సాంబుడు" అనే కుమారుడు జన్మించాడు.

కృష్ణుడే గురు దక్షిణ కోసం మరణించిన సాందీప కుమారుణ్ణి బ్రతికించి తెచ్చి మునికి అప్పగించాడు. భగవంతుడే మానవునిగా జన్మించినా తానుకూడా సంతానం కోసం భగవంతున్ని ప్రార్థించి అతని అనుగ్రహానికి పాత్రుడవ్వటం చెయ్యాల్సిందే. మానవ ప్రయత్నం చేస్తే గానీ భగవంతుని కృపకలుగదు. అన్నీ భగవంతుడే చేస్తాడని అనుకోరాదు. మానవుడు తన ప్రయత్నం తాను చెయ్యాలి. ఫలితాన్ని పరాత్పరునికి అప్పగించాలి.

ఆంధ్రప్రదేశ్ - తెలంగాణలలో

# దర్శనీయ దేవాలయాలు - చారిత్రక ప్రదేశాలు

## అరుంధతీ వశిష్ఠ మహర్షుల ఆలయం

(తూర్పు గోదావరి జిల్లా - ఆంధ్రప్రదేశ్)



శ్రీ రోహిణి మహేష్, M.A., L.L.B., కన్నావారి తోట 2వ లైను, 27-9-54, గుంటూరు - 522 004

అంతర్వేది ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాలో రాజమండ్రికి 104 కి.మీ. దూరంలో ఉంది. ఇక్కడ ప్రసిద్ధి చెందిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉంది. ఇక్కడ అరుంధతీ వశిష్ఠ మహర్షుల ఆలయం కూడా వుంది.

అంతర్వేదిని ఆది కూర్మ క్షేత్రంగా పిలుస్తారు. యుగాంతంలో జలాంతర్గామియైన భూమిని కూర్మావతారంలో మహావిష్ణువు తన వీపుపై ధరించి పైకి తెచ్చే క్రమంలో ఆవిర్భవించిన తొలిభూభాగమ్ "అంతర్వేదిక" అదే నేటి అంర్వేది. ఈ పుణ్యభూమిపై బ్రహ్మ తన తొలి పాదాన్ని మోపి సృష్టి మహాయజ్ఞానికి శ్రీకారం చుట్టాడు. బ్రహ్మయజ్ఞవేదిక అంతర్వేదికగా వ్యవహరింపబడి అంతర్వేదిగా పుణ్యప్రదమైంది.

దేవదానవులు క్షీరసాగరాన్ని మథించిన దివ్య ప్రదేశం ఇది. సాగర మథనంలో ఉద్భవించిన హాలాహలాన్ని పరమేశ్వరుడు కంఠంలో ఉంచుకొని నీలకంఠుడిగా ఈ క్షేత్ర పాలకుడిగా కొలువయ్యాడు. (ఈ కేత్రానికి సంబంధించిన వివరాలు సవివరంగా గతంలో జనవరి 2002 సంచికలో వివరించటం జరిగింది. ప్రస్తుతం అరుంధతీ వశిష్ఠ మహర్షుల ఆలయానికి సంబంధించిన వివరాలు తెలుసుకుందాం)

సమస్త ఋషులలో అగ్రగణ్యుడు వశిష్ఠ మహర్షి తపస్సు చేసి శ్రీ లక్ష్మీనరసింహస్వామిని కొలువు దీర్చిన క్షేత్రం ఇది.

గౌతమ మహర్షి తన తపోశక్తితో గోహత్యా పాపం పోవడానికి తీసుకొని వచ్చిన అఖకండ గౌతమిని సప్తమహర్షులు ఏడుపాయలుగా చేసి వాటిని వేరు వేరు ప్రదేశాలలో సముద్రంలో విలీనం చేశారు. వీటిలో వశిష్ఠ మహర్షి తెచ్చిన గోదావరి పాయకు వశిష్ఠ గోదావరి అని పేరు. దీనిని అంతర్వేది వద్ద సాగర సంగమం చేసి ఈ ప్రాంతంలో ఆశ్రమం నిర్మించుకొని తన భార్య అరుంధతీదేవి, వంద మంది సంతానంతో యజ్ఞయాగాదులు చేశాడు. ఇక్కడే శ్రీ అరుంధతీ వశిష్ఠ మహర్షుల ఆలయం వుంది.

ఈ ఆలయం అష్ట భుజాకారంగా చుట్టూ నీటిలో ఆవరించబడి హృదయ పద్మకర్ణిక మధ్యలో వెలుగొందే ఓంకారేశ్వరునికి సంకేతంగా ఈ వశిష్టాలయం నిర్మించబడింది. ఈ ఆలయ నిర్మాణంలో ధ్యాన, ప్రాణాయామ ప్రక్రియతో సూర్య, చంద్ర పృధ్వీ గమనాదులతో అనుసంధానం చేసి వేదశాస్త్ర ప్రమాణాలు పాటించారు. శ్రీమహామేరు సహిత ఆదికూర్మ ప్రతిష్టతో దేవాలయ క్రింది అంతస్తులో స్థాపన చేశారు. దీనిలో కూర్మం ఆది కూర్మావతారంగా అంతర్వేదిని జలంతర్గం నుండి పైకి తెచ్చిన మహావిష్ణువు సంకేతంగా దర్శనమిస్తుంది. ఆది పరాశక్తి త్రిపుర సుందరి అమ్మవారే మహామేరు యంత్రములోని బిందు స్వరూపం.

పై అంతస్తులో అష్టభుజాలలో ప్రధాన భుజమందు అరుంధతీ వశిష్ఠుల ప్రతిష్ట, దక్షిణ భాగంలో ప్రాణ

ప్రతిష్టకు ఆధారమైన మూలాధార ఆదిదేవత విజయగణపతి ప్రతిష్ట మిగిలిన దిక్కులలో సప్త ఋషులలోని కశ్యప, అత్రి, భరద్వాజ, విశ్వామిత్ర, గౌతమ్, జమదగ్ని ఋషులు ఉండటం విశేషం. సాలగ్రామ శిలారూపంలో వున్న ఈ విగ్రహాలు దివ్య తేజస్సుతో ఉన్నాయి.

సూర్యభగవానుని వరప్రసాదంగా జన్మించిన అరుంధతీ దేవికి, వశిష్ట మహర్షికి జరిగిన వివాహానికి సమస్త దేవతలు వచ్చి అనేక బహుమతులులిచ్చారు. దివ్యజ్యోతులై ఆకాశమున విరాజిల్లుతూ ఆదర్శ దంపతులుగా సమస్త దంపతులకు రక్షణగా నిలుపమని ఆశీర్వదించారు. అందుకే అరుంధతీ వశిష్ఠ ఆలయ దర్శనంతో దంపతులమధ్య అన్యోనత వృద్ధి చెందుతుంది

సుఖసంతోషాలు వర్ధిల్లుతాయి. స్త్రీలకు నిత్యసౌభాగ్యం, పురుషులు శ్రేష్ఠులుగాను ప్రేమానురాగాలతో వర్ధిల్లుతారని, పుణ్యప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం.

మన జీవన విజయాలకు ఆధారమైన అంతర్గత శక్తిని వెలికి తీసుకొని రావాలంటే అంతర్గత శక్తులకు ఆధారమైన సప్త ఇంద్రియాలు, వాటి ప్రేరకులైన సప్త ఋషుల అనుగ్రహం ఈ ఆలయంలోని సప్త ఋషుల దర్శనంతో లభిస్తుంది.

ఈ ఆలయానికి అనుసంధానమై విద్యావైజ్ఞానిక యోగ శిక్షణా సంస్థగా శ్రీవశిష్ఠ ఆశ్రమం సేవలు అందిస్తుంది. సమగ్ర వ్యక్తిత్వ వికాశం, స్వయం, మార్గదర్శకత, వసుదైక కుటుంబ భావన అనే ప్రధాన లక్ష్యాలతో వశిష్ఠుని బ్రహ్మ విద్యా భావాల ఆధారంగా ఆశ్రమం తాలూకు సూక్ష్మరూపం రూపొందించి శాస్త్రీయంగా అనేక పరిశోధనలు నిర్వహిస్తున్నారు. □

---

➢ 19 వ పేజి తరువాయి ......

మొక్కలను చూస్తున్న బ్రాహ్మణునితో మాయా వేషంలో వున్న ఇంద్రుడు ఇలా అన్నాడు. తోటను ఎవరునాటారో, ఎవరు పెంచారోగాని చాలా అద్భుతం, కన్నులపండుగగా ఉంది. ఇంత అందమైన తోటను నేనెక్కడా చూడలేదు. అనగానే ఆ తోటను గురించి పొగడ్త విని బ్రాహ్మణుడు పొంగిపోయాడు. అహం పెరిగింది ఈ తోటనాదే. ఈ మొక్కలన్నింటిని నేనే పెంచాను. అని ఆత్మస్తుతి చేసుకొంటూ ఇంద్రునికి తోటనంతా చూపిస్తూ తన గొప్పలు చెప్పుకున్నాడు. ఇంతలో చనిపోయిన ఆవు వద్దకు చేరారు. ఇంద్రుడు ఆశ్చర్యం నటిస్తూ అయ్యో! ఈ ఆవును ఎవరు చంపారో అంటూ బ్రాహ్మణుని వైపు చూశాడు. ఈ చెట్టును మొక్కలను నేనే పెంచాను అని అంతవరకు తన గొప్పలు చెప్పిన బ్రాహ్మణుడు సమాధానం చెప్పలేక నిలబడిపోయాడు. అప్పుడు ఇంద్రుడు నిజరూపం ధరించి! ఓరీ వంచకుడా! ఈ తోటనాదే, మొక్కలు నేనే పెంచాను అని చెప్పుకొచ్చావే. ఈ ఆవును చంపిన పాపం మాత్రం నాకు అంటకట్టాలనుకున్నావా అంటూ ఇంద్రుడు మాయమయ్యాడు.

గోహత్యాపాతకం బ్రాహ్మణుడిలో ప్రవేశించింది.

లోకంలో ఎంతో మంది తమ గొప్పలు తాము చెప్పుకుంటారు. కాని ఆ గొప్పదనమంతా భగవంతుని అనుగ్రహంతో సాధించామనరు. తప్పులను మాత్రం ఇతరులపైకి నెట్టుతారు. విజయాలు మాత్రం తనవేనంటారు. అన్నిటికి సాక్షీ భూతుడు పరమాత్మే అని అనుకుంటే జయాపజయాలు మానవున్ని పొంగి పోనీయవు, క్రుంగదీయవు. మహనీయులందరూ కూడా ఎంతో గొప్పపనులు చేసినా తమదేమీ లేదు అంతా ఆపైవాని దయ. ఇతరుల సహకారం అంటుంటారు. □

# శ్రీరామ భక్తి



## 8. ఆరణ్యకముని శ్రీరామ భక్తి

- కీ.శే డాక్టర్ రోహిణి వెంకట సుందరవరదరాజేశ్వరి

**రామనామ బిను గిరాన సోహా।**
**దేఖు బిచార త్యాగి మదీ మోహా॥**

శ్రీరాముడు త్రేతాయుగమందు అవతరించెను. అంతకంటె ముందు ఆరణ్యకముని పరమాత్మ తత్త్వమును గ్రహించి, పరమశాంతి పొందుటకు ఘోరముగ తపస్సు చేయుచుండెను. దీర్ఘకాలమైనను తపఃఫలము లభించలేదు. అప్పుడు ముని మరియొక జ్ఞానియగు పురుషుని వెదుక నారంభించెను. అతడు అనేక తీర్థములు తిరిగెను. ఎంత మందినో కలిసెను. కాని సంతోషము గలుగలేదు. అతడు ఒక దినము తపోలోకము నుండి తీర్థయాత్ర కొరకు క్రిందికి దిగిన లోమశ ఋషిని దర్శించెను.

ఆ ఋషిని సమీపించి చరణములకు ప్రణామములు గావించి నమ్రతతో ఇట్లు ప్రార్థించెను. “మహాత్మా! దుర్లభమైన మానవ శరీరము పొందిన జీవులు, ఏ ఉపాయమున ఈ సంసార సాగరమును దాటవలెను ? మీరు దయతో నాకేదైన అట్టి వ్రతదాన, జప, యజ్ఞములుగాని, దేవారాధనగాని వున్న చెప్పి ఈ భవసాగరము నుండి దాటించుడు.

“దాన తీర్థ వ్రతయమ నియమ యజ్ఞయోగ తపః ప్రభృతులన్నియు ఉత్తమమైన కర్మలు. కాని దీని ఫలితము స్వర్గము. ఎప్పటి వరకు పుణ్యముండునో ప్రాణులు అప్పటి వరకు స్వర్గమందు సుఖములను భవించెదరు. పుణ్యము సమాప్తమైన తరువాత క్రింద పడదురు. అయినను వీరు శుభకర్మలు చేయని మూఢులకంటె ఉత్తములు. చూడుము నేను నీకు ఒక ఉత్తమమైన రహస్యమును చెప్పుచున్నాను వినుము. శ్రీరామ భగవానుని కంటె గొప్ప దేవతలు లేరు. రామవ్రతము కంటె ఉత్తమమైనదిలేదు. రాముని కంటె శ్రేష్టమైన యోగము లేదు. గొప్ప యజ్ఞములు కూడాలేవు. శ్రీరామనామ జపము, శ్రీరాముని పూజించుట చేయు మనుష్యులు ఈ లోకము నందును, పరలోకమునందును సుఖపడెదరు. శ్రీరాముని శరణు వేడిన ప్రాణులు అనాయాసముగ సంసార సాగరమును దాటుదురు. శ్రీరాముని స్మరించి ధ్యానించు మానవుల అన్ని కోరికలు సిద్ధించును. ఇట్టివారికి పరమపద ప్రాప్తిని కలిగించు భక్తి శ్రీరాముడే ఇచ్చును. ఉత్తమ కులమందు జన్మించిన వారి మాటకేమిగాని, చండాలురైనను ప్రేమతో శ్రీరాముని స్మరించిన పరమగతిని పొందుదురు. శ్రీరాముడొక్కడే పరమదైవము. శ్రీరాముని పూజించుటే ప్రధాన వ్రతము. రామనామమే సర్వోత్తమమైన మంత్రము. శ్రీరాముని స్తుతియే ఉత్తమ శాస్త్రము. అందువలన నీవు హృదయ పూర్వకముగ శ్రీరాముని భజింపుము, పూజింపుము, ధ్యానింపు” మని లోమశ మహర్షి ఉపదేశించెను.

ఉపదేశము వినిన ఆరణ్యకముని అమితానందుడయ్యెను. “ధ్యానించుటకు శ్రీరాముని స్వరూపమును తెలుపు” డని కోరెను.

“రమణీయా యోధ్యా నగర మందు కల్పతరువు క్రింద విచిత్రమండప మందు శ్రీరామ చంద్ర

భగవానుడు విరాజమానుడై యుండును. మహామరకత మణి, నీలకాంతమణి స్వర్ణములతో నిర్మించిన అతిమనోహరమైన సింహాసనము వానిది. ఆ సింహాసనము కాంతి నాలుగు వైపులకు వెదజల్లబడుచుండును. నవ దూర్వాదల శ్యామ సౌందర్య సాగరుడు, దేవేంద్ర పూజితుడు భగవానుడగు శ్రీరఘునాధుడు సింహాసనముపై కూర్చుండి తన ప్రకాశముతో మునుల మనస్సులను హరించుచుండెను. వాని ముగ్ధ ముఖ మండలము కోట్ల చంద్రుల కాంతిని మించియున్నది. వాని కర్ణములకు మకరాకృతి కుండలములు, మస్తకముపై కిరీటము శోభించుచుండెను. కిరీటమందున్న మణులు రంగుల కాంతితో శరీరము రంజిత మగుచున్నది. మస్తకముపై నల్లని ఉంగరములు తిరిగిన కేశములున్నవి. ముఖమందు చంద్రకిరణముల వంటి దంతపంక్తి శోభించుచున్నది. వాని అధరము విద్రుమ మణివలె మనోహరముగనున్నది. వీని యందు శాస్త్ర సహిత ఋక్సామాది నాలుగు వేదముల స్ఫూర్తి యున్నది. వాని ముఖ కమలమందు నాసిక జపాం కుసుమమువలె నున్నది. వాని కంఠము కమనీయ శంఖమువలెనున్నది. వీని రెండు భుజములు సింహస్కంధముల వలె ఎత్తుగ బలముగ నున్నవి. బాహువులు మోకాలి వరకు ఉన్నవి. చేతులయందు పచ్చల ఉంగరములు మెరయుచున్నవి. కేయూర కంకణములు అపూర్వముగ శోభిల్లుచున్నవి. వీని మనోహర విశాల వక్షఃస్థలము శ్రీలక్ష్మీ శ్రీవత్సాది విచిత్ర చిహ్నములతో విభూషితమైయున్నది. ఉదరమందు మూడు రేఖలున్నవి. నాభి గంభీరముగనున్నది. మనోహరముగ నున్న నడుమున మణులతో పొదిగిన మొలత్రాడు శోభతోనున్నది. సుందరమైనవి భుజములు, మనోహరమైనవి మోకాళ్ళు. యోగులకు ఆరాధ్యము పరమ మంగళమయమునకు చరణము గల మందు వజ్రము, అంకుశము, ధ్వజాది చిహ్నములు అంకితములైయున్నవి. హస్తమందు ధనుర్బాణములు, భుజస్కంధములపై అంబులపొది శోభించుచున్నవి. ముఖముపై సుందరమైన తిలకముగలదు. ఈదివ్య శోభా పూర్ణాకృతితో శ్రీరాముడు అందరి చిత్తములును బలవంతముగ తనవైపు లాగుచున్నాడు".

ఈ విధముగ ప్రకాశించుచున్న శ్రీరాముని దివ్య స్వరూపమును లోమశుల వారు వర్ణించి చెప్పి "మునీ! ఈ విధముగ నీవు శ్రీరామ భగవానుని ధ్యానించి స్మరించిన అనాయాసముగ సంసార సాగరమును దాటగలవు" అని చెప్పెను.

లోమశులవారి మాటలు వినిన ఆరణ్యకముని వినయముగ "భగవానుడా! నాయందు దయతో శ్రీరాముని ధ్యానమును చెప్పి గొప్ప మేలు చేసితిరి. మీ ఉపకార భారముతో ముడుచుకొని పోయితిని. స్వామీ! ఈ శ్రీరాముడెవరు ? వీని మూల స్వరూపమేది ? ఈ అవతారము ఎందుకు ధరించెను ? చెప్పు"డని కోరెను.

లోమశ మహర్షి "వత్సా! పూర్ణ సనాతన పరాత్పర పరమాత్మయే శ్రీరాముడు. సమస్త విశ్వబ్రహ్మాండములను ఇతడే ఉత్పత్తిగావించెను. ఇతడే సర్వధారుడు. అందరిలో వ్యాపించియున్న అందరిస్వామి అందరిని సృష్టించువాడు, పాలించువాడు, సంహరించువాడు ఇతడే. సమస్త విశ్వము ఇతని లీలా వికాసమే. సమస్త యోగీశ్వరులకు పరమేశ్వరుడు దయాసాగరుడు. జీవుల దుర్గతిని చూచి వారిని ఘోర నరకముల నుండి రక్షించుటకు జగత్తు నందు తన లీలలను,

గుణములను విస్తరింపజేసెను. వీనిని గానము చేసి పాపులు తరించుచున్నారు. ఈ శ్రీరాముడు అవతరించుటకు ఇదియే కారణము" అని చెప్పెను.

తరువాత లోమశముని శ్రీరాముని చరిత్ర మొత్తము సంక్షేపముగ చెప్పి "త్రేతాయుగాంత మందు శ్రీరాముడు అవతరింపబోవుచున్నాడు. అప్పుడు శ్రీరాముడు అశ్వమేధ యజ్ఞము చేయును. అశ్వము వెంట రాముని తమ్ముడు శత్రుఘ్నుడు వచ్చును. అతడు మీ ఆశ్రమమునకు వచ్చును. అప్పుడు మీకు శ్రీరాముని దర్శించి వానిలో లీనులుకండు" అని చెప్పెను.

మహర్షి ఉపదేశానుసారము ఆరణ్యక ముని రేవానది తీరమున ఒక కుటీరము నిర్మించుకొని ఉండసాగెను. నిరంతరము రామనామ జపముతో పూజాధ్యానములందుండెను. చాలా కాలము గడిచిన తరువాత అయోధ్యలో మర్యాదా పురుషోత్తముడు శ్రీరాఘవేంద్రుడు అవతరించెను. లంకా విజయాది లీలలు గావించ అయోద్యలో అశ్వమేధ యజ్ఞము చేయుచుండెను. అప్పుడు యజ్ఞాశ్వమును వదలిరి. అశ్వము వెనుక గొప్ప సేనతో శత్రుఘ్నుడు వెళ్ళుచుండెను. అశ్వము రేవాతీరమున నున్నముని ఆశ్రమమును సమీపించెను. శత్రుష్నుడు తన వెంటనున్న సుమతితో "ఇది ఎవరి ఆశ్రమము" ? అని అడిగెను. అతడు పరిచయము చేయగా ముని ఆశ్రమమున కేగెను. ముని వానికి స్వాగతము పలికి, శత్రుష్నుని పరిచయము పొంది ఆనందమగ్నుడయ్యెను. "నా చిరకాల వాంఛ నెరవేరినది. నేనింక ఇప్పుడు శ్రీరామ భగవానుని దర్శించెదను. నా జీవితము సఫలమగును" అని తలపోయుచు పరమ రమణీయమగు అయోధ్యా నగరమునకు వెళ్ళెను.

నవదూర్వాదల శ్యాముడగు శ్రీరాముడు నియమానుసారముగ ఆ భూషణ రహితుడై మృగ చర్మ ఉత్తరీయము ధరించి హస్తమున దర్భతో సరయూ తీరమున యజ్ఞశాల యందు యజ్ఞదీక్షలో నుండెను. అచట ధరిద్రులకు కోరిన వస్తువులిచ్చుచుండిరి. విప్రులకు సత్కారములు చేయుచుండిరి. ఋషి గణములు మంత్రములు పఠించుచుండిరి. కాని ఆరణ్యకముని శ్రీరాముని రూపమాధుర్యమును దర్శించుచు వున్న చోటనే నిలువబడి యుండెను. శరీరము పులకించెను. తెలివితప్పి భువన మంగళ రూపమును దర్శించుచునే యుండెను

మర్యాదా పురషోత్తముడు మునిని చూచెను. వెనువెంటనే నిలువబడెను. ఇంద్రాది దేవతలు లోకపాలురు ఎవరి చరణములపై శిరస్సులుంచెదరో ఆ సర్వేశ్వరుడు శ్రీరాముడు "మునివర్యా! నేడు మీ రాకతో నేను పవిత్రుడనైతిని" అనుచు ముని చరణములపై పడెను. ఆరణ్యక ముని వెంటనే శ్రీరాముని లేపి తన హృదయమునకు హత్తుకొనెను. తరువాత మునిని ఉచ్చాసనముపై కూర్చుండబెట్టి రాఘవేంద్రుడుస్వయముగ తన హస్తములతో వాని చరణములు కడిగి ఆచరణోదకమును తన శిరస్సుపై చల్లుకొనెను. రాముడు బ్రాహ్మణ్య దేవుడు. బ్రాహ్మణుని స్తుతించుచు "ముని శ్రేష్ఠా! మీ చరణోదకముతో నేను నా బంధువులతో గూడ పవిత్రుడనైతి. మీ రాకతో నా అశ్వమేధ యజ్ఞము సఫలమయ్యెను. ఇప్పుడు నిశ్చయముగ మీ చరణ ధూళితో పవిత్రుడనై ఈ యజ్ఞమువలన రావణ, కుంభ, కర్ణాది బ్రాహ్మణ సంతానమును వధించిన దోషము నుండి విముక్తుడనగు చుంటిని"అని పలికెను.

భగవానుని మధుర వాక్కులను వినిన ముని నవ్వుచు నిట్లనెను. ''ప్రభూ! మీరు మర్యాదను రక్షించువారు. వేదములు, బ్రాహ్మణులు మీ రూపములే. అందువలన మీరు ఇట్లు మాట్లాడుట ఉచితముగాదు. ఇతర రాజులకు ఆదర్శమగుటకు మీరిట్లు ఆచరించుచున్నారు. బ్రహ్మ హత్యాపాతకములు పోవుట కొరకే మీరు అశ్వమేధ యజ్ఞము చేయుచుంటిరి. మర్యాదా పురుషోత్తమా! మీ మర్యాదా పలన ధన్యము. మహా పాపులు కూడ మీ నామము స్మరించిన పాప సముద్రమును దాటి పరమ పదమును పొందుదురు. రామ నామము ఉచ్చరించని వారిని పాపతాపములు భయపెట్టుచుండును. శ్రీరామా! నేడు నేను ధన్యుడనైతిని. రామ నామ రూప సింహగర్జన వినినంతనే మహా పాప రూప గజములు నామరూపములు లేకుండ పోవును. ఇది పొందిన నేను సంసార తాపము నుండి ముక్తుడనైతిని''.

ముని వచనములు వినిన శ్రీరాముడు వానిని పూజించెను. సమస్త ఋషులు, మునులు, భగవానుని లీలను గాంచి ''ధన్యులము ధన్యులము'' అని నినాదములు చేసిరి. ఆరణ్యకముని భావావేశమున అందరితో నిట్లనెను. ''మునిగణములారా! మీరందరు నా భాగ్యమును చూచితిరి. సర్వలోకమహేశ్వరుడగు శ్రీరాముడు నాకు ప్రణామము చేయుచున్నాడు. అందరికి పరమారాధ్యుడు నాకు స్వాగతము పలుకుచున్నాడు. శ్రుతులు వెదకుచుండెడి చరణ కమలముల వాడు నా చరణోదకము గ్రహించి పవిత్రుడనైతి ననుచున్నాడు. నేడు నేను ధన్యుడను'' అని చెప్పు చుండగ అందరి ఎదుట ముని బ్రహ్మరంధ్రము పగిలిపోయెను. పెద్ద శబ్దము అయ్యెను. స్వర్గమందు దుందుభులు మ్రోగించి దేవతలు పుష్పవర్షము కురిపించిరి. అందరు చూచుచుండగా ఆరణ్యకముని శిరస్సు నుండి ఒక విచిత్రమైన తేజస్సు వచ్చి రామునిలో లీనమయ్యెను.

- మన ఆనందాన్ని మరొకరికి పంచాలంటే త్యాగం కావాలి. అదే ఎదుటి వారి ఆనందంలో మనం భాగం పంచుకోవాలంటే అసూయారహిత హృదయం కావాలి.
- మనం సంపాదిస్తున్నవేవీ నిత్యం మనకు అనుకూలంగా ఉండేవికావు. అది దేహమైనా, ధనమైనా, ఆరోగ్యమైనా. కనుక అవి అందుబాటులో వున్నప్పడే వాటిని మంచి కోసం ఉపయోగించాలి.
- కట్టె నిప్పతో కలిసి పాత్రను కాల్చాలనుకుంటుంది. కాని మండీమండీ తాను బూడిదవుతుంది. మంట తగ్గగానే పాత్ర చల్లబడుతుంది. అలాగే మనిషి ఈర్ష్య అనే అగ్నితో స్నేహం చేసి ఎదుటివారిని నాశనం చేయాలని చూస్తాడు. కాని ఆ కట్టెలాగ తానే ఆ మంటకు బలియౌ తాడు.
- మానవుడు మరణానికి ముందు భగవంతుని కోరే చివరి కోరిక "తనను ఇంకా కొంతకాలం బ్రతికించమని"
- ఇతరుల కోసం గోతిని త్రవ్వేవాడు తనకు తెలియకుండానే వాడికన్నా ముందు అందులో దిగుతున్నాడని గుర్తించ లేకపోతున్నాడు.

# వివిధ వ్యాధులు - ఆయుర్వేద చికిత్సలు

డా॥ టి. చంద్రశేఖరం, తిరుపతి. 9701181966

(గత సంచిక తరువాయి)

## 5.3. ఆవు నెయ్యి -సంపూర్ణ ఆరోగ్యానికి పునాది

1. మానసిక దోషాలను, కాలుష్యాలను పోగొట్టడములో ఆవునెయ్యి అద్భుతముగా పనిచేస్తుంది. మానసిక ఉద్రేకాలను, ఆందోళనలను, బలహీనతలను సమర్థవంతముగా అరికట్టి మనస్సుకు సామర్థ్యాన్ని, ప్రశాంతతని అందిస్తుంది.

2. మనిషి జీవించినంత కాలం నిరోగిగా వుండాలన్నా, పుష్టిగా, తుష్టిగా, సంపూర్ణ మానవునిగా జీవించాలన్నా ఆవునెయ్యి ప్రతి రోజు వాడడం చాలా అవసరం.

3. ఆవునెయ్యి వాడడానికి డబ్బు లేకపతే అప్పు చేసి అయినా ఆవునెయ్యి కొనుక్కొని రోజూ తినాలని శాస్త్రం నిర్దేశించింది.

4. 30 ఏండ్ల ముందు వరకు మన భారతీయ కుటుంబాల్లో నెయ్యి తినని మనిషి ఒక్కరుకూడ లేరంటే అతిశయోక్తికాదు. కాలక్రమేణా గోవుల పెంపకం లాభసాటికాదని గ్రామాలలో గోవుల పెంపకం నిరాదారణకు లోనై మన జాతి బలాన్ని, ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నది. దానికి తోడు ఇంగ్లీషు వైద్య ప్రభావం పెరిగి, స్వదేశీ వైద్యం ఆదరణకు కరువై తెరమరుగైన కారణముగా నెయ్యి వాడకం గణనీయంగా తగ్గిపోయింది. ఈ కారణంగానే దేశములో రోగుల సంఖ్య పెరిగిపోయి నేడు అసలు ఏ రోగంలేని మనిషి ఒక్కడు కూడలేని దుస్థితి దాపురించింది.

5. ఆవు వెన్న బలాన్ని, తేజస్సును, ధాతు పుష్టిని అందిస్తుంది. ఊపిరితిత్తులకు మంచి శక్తిప్రసాదించి క్షయ, దగ్గు, తాపము మొదలైన బాధల నుండి రక్షిస్తుంది.

6. చదువుకొనే బాలబాలికలకు ఆవు వెన్న 10 నుండి 20 గ్రా॥ తినిపిస్తుంటే వారి శరీరం గట్టిపడి వ్యాధి నిరోధక శక్తి, చర్మకాంతి, జ్ఞాపకశక్తి వృద్ధి చెందుతుంది. ఆరోగ్యవంతమైన, శక్తివంతమైన పిల్లలు జాతికి ఎంతో అవసరం.

7. ఆవునెయ్యిలో అనంతమైన ఆరోగ్యశక్తులు దాగివున్నాయని దానిని ఆహార పదార్థముగాను, యజ్ఞప్రధాన ద్రవ్యముగాను, పూజా ద్రవ్యంగాను వాడి తీరాలని మన మహర్షులు, పెద్దలు సూచించి, శాసించారు.

8. ఆవునెయ్యి, ఆముదము, నువ్వులనూనె ఈ మూడింటికి రసాయనిక శక్తి, యోగవాహిక శక్తి గలిగిన అపురూప ద్రవ్యాలని వీటిని వాడని మానవజన్మ నిస్సారమైపోతుందని ఆయుర్వేద మహర్షులు నిర్ధారించి వున్నారు.

9. దేవానాం ఆజ్యం ఆహారం అంటే దేవతలకు కూడ నెయ్యి మాత్రమే ఆహారం అని వేదాలు బోధిస్తున్నాయి.

10. భోజనం చేసేటప్పుడు ముందుగా ఐదు మెతుకులు తినే ఆచారం మన ప్రాచీన కుటుంబాలలో వుండేది. అన్నం వడ్డించిన తరువాత పైన కొంచెం నెయ్యి చిలకరించి వుండేది. ఆ నేతితో తడిచిన ఐదు మెతుకులు నోట్లో వేసుకొని రెండు చెంచాల మంచినీరు తాగేవారు. ఎందుకంటే భోజన సమయానికి ఉదరంలో వాయువు ప్రకోపించి వుంటుంది. కాబట్టి దాన్ని శాంతపరిచి ఆహారమార్గాన్ని, ఉదరాన్ని శుద్ధి చేసుకోవడం కోసం ఈ ప్రక్రియ పాటించేవారు.